UNIVERSAL LIBRARY
OU_204267
UNIVERSAL LIBRARY

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T 83·1 N21P

Accession No. T 2847

Author నారాయణరావు.

Title పరిణయ కథామంజరి

This book should be returned on or before the date last marked below.

Approved by the Text Book Committee.

# పరిణయ కథామంజరి

గ్రంథకర్త

రూపనగుడి నారాయణరావు,

సహాయోపాధ్యాయుడు,

గవర్నుమెంటు ట్రైనింగు స్కూలు, బళ్ళారి.

ఆంధ్రవిద్యార్థి ప్రచురణాలయము,

పూల బజారు, బళ్లారి.

1933

కాపీరైటు

వెల 8 అణాలు

నాల్గవ కూర్పు
2000 ప్రతులు.

శ్రీ సాధన ముద్రాశాల,
అనంతపురము.

## PUBLISHER'S NOTE.

All the 1000 copies of the third Edition were exhausted within a few months owing to the unfailing patronage of the Andhra public and as the demand for the book has been growing keener and keener day by day we have pleasure in publishing a Fourth Edition of the same. The rapid sale of all the copies of the three editions, is itself a testimonoy to the interest evinced in the book by the reading public. We hope that the same kind patronage will be extended to this Edition also.

## OPINION.

The book "PARINAYA KATHAMANJARI" contains excellent short Puranic stories in easy Telugu prose and offers suitable material to the younger boys and girls for home study and for non-detailed study in schools. Such short stories taken out of our Literature and written in an easy prose on classified topics, are bound to re-create a love for our Literature and religion in our youngsters

Anantapur. 17—7—24 } N. K. VENKATESAM, M.A. L.T.,
Lecturer in English,
Ceded Districts College.

# పీఠిక

భాషాయోషామణి తన ప్రాఁతసింగారమునందు విసువుచెందినది; క్రొత్త తొడవులుదాల్చి, వింతసోయగమున వెలయుచున్నది. కాలపరిణామమునుబట్టి ప్రపంచ పరిస్థితులయందు మార్పులు కలుగుచుండుట సహజమేకదా! ఈక్రొత్త ఋతువున క్రొత్తతావుల వెదచల్లు క్రొత్త మంజరులు ప్రతిక్షణ విలక్షణములై బయలు వెలియుచున్నవి. వానిలో ఈ "పరిణయకథామంజరి" యొకటి.

ఈచిన్ని పొత్తమునందలి కథలు నవలలందలి కథలవలెఁ గల్పితములు కాక, సుప్రసిద్ధములైన పురాణములనుండి సేకరింపఁబడి, సమయానుకూలములైన నూతన సంవిధానములతో సందర్భోచితమైన చక్కని వర్ణనములతో మనోహరమగు రీతిని రచింపఁబడినవి.

తెలుఁగు చదువనేర్చిన స్త్రీలకు, పురుషులకు, బాలురకు, వృద్ధులకు, అందఱకును సుబోధమగులాగున నీపుస్తకము సులభశైలిని సలక్షణమగు భాషలో సంతరింపఁబడినది. నిఘంటువులఁ దిరుగవేసినఁగాని యర్థముగాక వేసట పుట్టించు కఠినపదములుగాని, దీర్ఘసమాసములుగాని యిందుఁగానరావు. వట్టిపెండ్లి మాటలతోనే పొద్దుపుచ్చక కవి, దైవభక్తి, పతిశుశ్రూష, సత్యము, ఆర్జవము, మున్నగు సనాతన ధర్మముల నిందు సమంజసముగ నందముఁ బొందుపఱిచి యున్నాఁడు. ఇట్టి చక్కని నీతులను బోధించి, చదువరులబుద్ధిని వికసింపఁజేయు పుస్తకములను విద్యార్థులచేఁ జదివించుటయే మిక్కిలి యుపయోగకరమని నానమ్మిక.

అనంతపురము,
20—11—22

ప్రయాగ వేంకటరామశాస్త్రి,
దత్తమండల కళాశాలాంధ్రపండితుఁడు.

# పార్వతీ పరిణయము

తొల్లి యొకానొక కాలమున మేనకాదేవి పర్వతేశ్వరుఁడను భార్యాభర్తలుండిరి. వీరు హిమాలయపర్వత ప్రదేశమున నివసించుచుండిరి. వీరికిఁ బార్వతి యను కూఁతురు గలదు. పార్వతి మెఱపుఁదీఁగవంటి మేని చాయగలిగి చక్కని తోడిబాలికలలో నెల్ల మిన్నయై యుండెను. ఈచిన్నది మందాకినీ తీరమందలి యిసుక తిన్నెలమీఁదఁ దోడిసఖులతో నాడుచు, విద్యాభ్యాస కాలంబున విద్యలనేర్చుచుఁ, దల్లిదండ్రులకుఁబోలె బంధుజనంబులకును ప్రమోదంబు గూర్చుచుండెను.

అంత నప్పడఁతికి బాల్యముజాఱి యౌవనము వచ్చెను. సూర్యోదయంబునఁ దామరమొగ్గలు వికసించు చందమున, యౌవనోదయంబున నామె కంగకంబులు వికాసముపొందెను. ఆమె, కొండలోయలలో నొంటిగా విహరించుచు, గిరిగహ్వరములు మాఱుమోఁగునట్లు కంఠమెత్తి మధురంబుగఁ బాడును. ఒక్కొక్కనాఁడు చెలులతో స్వచ్ఛమగు శిలాతలంబునఁ బ్రవహించు నిర్ఝరాంబువుల నాడును.

ఇట్లుండఁగా నొకనాఁడు పర్వతేశ్వరునింటికి నొకమహర్షి వచ్చి పార్వతికి సోమకిరీటుఁడగు శంకరుఁడే మగఁడు కాఁగలఁడని చెప్పిపోయెను. ఈ పరమముని యెప్పుడు వీణవాయించుచు హరినామస్మరణము సేయుచుండును. ఈతఁడే నారదుఁడు.

నారద మహాముని చెప్పిపోయిన దాదిగఁ బర్వతేశ్వరుఁడు వరాన్వేషణము మాని తనకూఁతును శంకరునకె యీ నిశ్చయించెను. శంకరునకుఁ దల్లిదండ్రులు లేరు. కావున నాతనికిఁ గన్యనీఁదలఁచినవారు ఆతనినె యడుగవలసి యుందురు. సర్వసంగపరిత్యాగియైన శంకరుఁడు తనకూఁతును వివాహమాడ నీకొనునో యీకొనఁడో యను సందేహముచేతఁ బర్వతేశ్వరుఁ డాతని నభ్యర్థింపఁడయ్యె.

అప్పటికి బహుదినంబులుగా శంకరుఁడు హిమవత్పర్వత పాదభూమియందుఁ దపము చేయుచుండెను. ఆప్రదేశము కడు రమ్యమైనది. అందు గంగానది, మిక్కిలి యున్నతములగు దేవదారు రుద్రాక్ష మొదలగు వృక్షముల మొదళ్ళను దడుపుచుఁ, బ్రవహించుచుండును. ఎత్తునుండి సెలయేళ్ళు పడఁగాఁ గలిగెడి శబ్దమునకు దిశలు మాఱుమ్రోఁగు చుండును. అందు శంకరుఁడు తపోనిష్ఠుఁడై యుండఁగాఁ బర్వతేశ్వరుఁడు

తన యనుఁగుఁగూఁతురగు పార్వతిని శంకరునకుఁ బరిచర్య చేయునిమిత్తము పంపెను. కాంత చెంత నుండుట తపోభంగమునకుఁ గారణమని యెఱింగియు శంకరుఁడు తనకుఁ బరిచర్య చేయుటకై యామెను గైకొని యథాపూర్వముగాఁ దపమాచరించుచుండెను.

పార్వతి శంకరుని పాదరాజీవములమీఁద మిక్కిలి భక్తిగలిగి మెలఁగుచుండెను. ప్రతి దినము పువ్వులు పల్లవములు గోసి తెచ్చును. శంకరుఁడు గూరుచుండునట్టి యరఁగును బాగుగ నలికి యందు ముగ్గులు పెట్టును; అర్ఘ్యోదకములను, ఉపకరణములను సిద్ధపఱుచును; గంధాక్షత లొడఁగూర్చి, ధూప దీపములు ముట్టించును.

## II

ఇట్లుండఁగా నొక్కనాఁడు స్వర్గములో నింద్రుఁడు పేరోలగం బున్నసమయంబున మన్మథుని బిలిపింపఁగా, నతఁడు చెఱకు విల్లును బూవుటమ్ములును బూని, చిగురాకుగొడుగును గేలఁ బట్టుకొని, మీనకేతనమెత్తి, చిలుకగుఱ్ఱము నెక్కి వచ్చెను. ఇంద్రుఁ డాతనిని గారవించి చేతికిఁ జేయిచ్చి సరిగద్దెమీఁదఁ గూరుచుండఁబెట్టుకొని యాతనినిరప్పించిన కారణ మీవిధముగాఁ దెలిపెను:

"ఓయీ మన్మథా! మేమొక గొప్పకార్యమందు నిన్ను నియోగింపఁ దలఁచి యున్నాము. ఆకార్యమును నిర్వహించుటకు నీవుతప్ప మఱెవ్వరును సమర్థులు గారు. హిమాచలపాదమున దేవదారువనమున నియతాత్ముఁడై శంకరుఁడు దపముచేయు చున్నవాఁడు. పార్వతియుఁ బర్వతేశ్వరుని నియోగమున శంకరునకు శుశ్రూషచేయుచు నక్కడనె యున్నది. నీవు పార్వతీ శంకరులను గూర్పవలెను. వీరిద్దఱ కుదయించెడు కుమారుఁడు, బ్రహ్మదేవుని వరముపొంది ముల్లోకముల నేలుచు బృందారకులను మహర్షులను నిష్కారణముగా బాధించు తారకాసురుని జయింపఁగలఁడని బ్రహ్మదేవుఁడు చెప్పి యున్నాఁడు. ఈకార్యమందు నీకు సహాయార్థముగ వసంతుఁడును, జంద్రుఁడును వచ్చువారు."

అందులకు మన్మథుఁడు "ఇది యెంతపని. దేవర యనుగ్రహముండిన నెవ్వరినైనను జయింపఁజాలుదును," అని యుత్సాహ వచనంబులు పల్కఁగా, నింద్రుఁడు "నీకుఁ గార్యవిజయమును క్షేమమును గలుగుఁగాక," అని యాశీర్వదించెను. మన్మథుఁడు దేవేంద్రుని యాజ్ఞను తలఁదాల్చి హిమాలయపర్వతంబునకు వెడలెను.

అంత వసంతుఁడు పల్లవాస్త్రుఁడై శుకపిక శారికా భృంగ సందోహముతోడఁ దాపసుల మనోధైర్యంబులు

సడల మన్మథ సహాయంబుగాఁ జనుదెంచెను.

చంద్రుఁడును దన కళల నతిశయింపఁ జేయుచు వెంటనె వచ్చుచుండెను.

## III

అంత వసంతచంద్రసమాగమంబున దారుకావనము శోభాయమానముగ నుండెను. వృక్షములు చిగురాకుఁజీరల ధరించెను. లతలు పువ్వుమొగ్గల దొడిగెను. మధుపములు మధురసపూర్ణములగు కుసుమపాత్రముల లోని మధువుం గ్రోలి చొక్కి ఝంకారము చేయుచుండెను. మృగీమృగంబులు జోడుగ విహరింప సాగెను. కింపురుష గుహ్యకాంగనలకుఁ జందనప్రవాహ మింపయ్యెను. అప్సరసలు హిందోళములఁబాడ నారంభించిరి. రాత్రులఁ బిండియారఁబోసినట్లు పండువెన్నెలలు గాయుచుండెను. అట్టిసమయమున మన్మథుఁడు శంకరుని జేరంజనెను. శంకరుఁడు పెనుబాముదు దలపాగగాఁ జుట్టి, కృష్ణాజినము ధరించి, నాసికాగ్రమున దృష్టినిలిపి యేకాగ్రచిత్తంబున ధ్యానము చేయుచుండెను. మన్మథుఁడు శంకరుని యెదురుగాని యొకప్రక్కగా నునిపొన్ననీడలో భయమందుచు నిలుచుండెను. అప్పుడచ్చోట శంకరుని పార్శ్వమునఁ బుష్పాంజలిపట్టి ధ్యానమునుండి

యతఁడు లేచుటను బ్రతీక్షించుచుఁ బార్వతియు నిలిచి యుండెను. మన్మథుఁ డాయువతిని గనుంగొని యదియె కార్యసాఫల్యమున కత్యావశ్యకమని యెంచి మెలమెల్లఁగ శంకరుని సమీపించి, విల్లెక్కుపెట్టి బాణమోక్షణ సమయముం బ్రతీక్షించుచుండెను. శంకరుఁడు ధ్యానము నుండి మేలుకొనఁగాఁ బార్వతి దోయిలించిన పువ్వులను నాతని యడుగులమీఁదఁ జల్లి నమస్కరించెను. నమస్కరింపఁగా శంకరుఁడు "నీవు సాటిలేని మగనిని బెండ్లాడుదువుగాక" అని దీవించెను. అంత నాలతాంగి తన యొడిలోనున్న మందాకినీ పద్మబీజమాలచే నాతనికంఠమును నలంకరించెను. ఆతఁడును దాని నాదరముతో గ్రహించి యామె ముఖాంభోజముపైనఁ బ్రేమపుంజూపులఁ బఱచెను. పార్వతి, యాతని భావముఁ దెలిసి మేనఁ బులకాంకురము లంకురింపఁగా లజ్జాభారముచేత నెమ్మోము వాంచెను. చెఱకువింట, నస్త్రరాజమగు సమ్మోహనాస్త్రమునుసంధించి యెడమకాలు ముందటికిఁ జాఁచి నిలిచి యల్లెత్రాటిని నాకర్ణాంతముగ లాగి గుఱిపెట్టి తద్విమోక్షణకాలమును బ్రతీక్షించుచుండిన మన్మథుఁ డిదియె సమయమని యెంచి బాణమును విడిచెను. తత్క్షణంబ శంకరునకు నింద్రియక్షోభంబు మిక్కుటము కాఁగా దానికిఁ గారణ మరయం దలంచి దిగంతములవఱ

కుఁ జూడ్కి నిగిడించెను. అప్పుడు కన్నెదుట మఱియొక బాణమును వింట సంధించి యధాపూర్వముగ నిలిచి యున్న మన్మథునిఁగాంచి కోపావేశుఁడయి భ్రూభంగము గావించి నొసలియందున్న మూఁడవకన్ను దెఱచెను. శరశరాసన తూణీరములతోఁ గూడ మన్మథుఁడు భస్మ మాయెను. అంత యువతీతోడి సంబంధము యోగవి ఘ్నమని యెంచి శంకరుఁ డంతర్ధానమాయెను. పార్వతి తన సౌందర్యంబు విలువ పోయినవిధమునఁ గనుఁ జిన్న పోయెను పర్వతేశ్వరుఁడు నిర్విణ్ణభావ మైన తన కూర్మితనయను నింటికిఁ దోడ్కొని పోయెను.

పిమ్మట మన్మథుని భార్యయగు రతీదేవి, తన మగఁడు శివునిచే భస్మముచేయఁబడుట యెఱిఁగి, వచ్చి భూమిమీఁదఁబడియున్న బూడిదను జూచి పరిపరి విధ ముల బలవింపఁదొడఁగెను. ఆమెమగని ప్రాణసఖుఁ డగు వసంతుఁడు వచ్చి యామెను నూరార్పఁ బ్రయత్నిం చెను గాని, యామె యూఱట చెందదయ్యె. తుద కామె తెంపున నగ్నిప్రవేశము చేయఁబోవ నప్పు డాకాశవాణి "ఓ మన్మథపత్నీ! సాహసమువలదు. ఈ ప్రయత్న ముడుగుము. నీకుఁ ద్వరలో శుభంబు కాఁగలదు. నీనా థుఁడగు మన్మథుఁడు గౌరీకల్యాణమయిన తోడనె పునర్జీవితుండగును".

ఉ॥ "ఎప్పుడు పెండ్లియాడుఁ బర
మేశ్వరుఁ డద్రితనూజ వేడ్కతో
నప్పుడు లబ్ధసౌఖ్యుఁడయి
యంబిక ప్రార్థన నాసదాశివుం
డెప్పటి యట్ల సర్వభువ
నైక ధనుర్ధరునిం బ్రియుం బ్రియం
బొప్పఁగ నిచ్చు నీకు మది
నొండు తలంపకు నమ్ము మాత్మలోన్."

అని పలికెను. అంత రతీదేవి సంతసించి గౌరీ కల్యాణకాలమ్మును నెదురుచూచుచుఁ దన కృశించిన దేహమును నెట్టెటో రక్షించుకొనుచుఁ బ్రాణములు పట్టుకొని యుండెను.

## IV

పార్వతి మిక్కిలి మృదువైన హృదయము గల దగుటచేత, శంకరుని నిరసనభావమునకు నొచ్చి, యాతనిం గూర్చి తపస్సుచేయ నిశ్చయించి, తనమనోరథమును దల్లి కెఱిఁగించెను. తల్లి యామెను గవుఁగలించి "బిడ్డా! నీ వెక్కడ! ఘోర వీర తప మెక్కడ! నీకిట్టిసాహసము వలదు," అని వారించెను. నిమ్నమునకు నోడిగిలు నీరు నిలుపుట యశక్యముగదా? పార్వతి యంతటితో నూర

కుండక తన మనోరథమును సఖీముఖమునఁ దండ్రి కెఱిం గించెను. తల్లియుఁ దండ్రియు యోజించి యామె యరణ్యావాసమునకుఁ దపస్సమాధినిష్ఠకును ననుమ తించిరి.

గౌరి (పార్వతి) యాభరణంబుల దిగఁద్రావి, వల్కలాజినములు ధరించి, తల్లిదండ్రులకు మ్రొక్కి, తండ్రి పంపున వచ్చిన జయవిజయులను నిరువురుచెలుల తోఁ గూడ నరణ్యమునకు మహేశ్వరుని (శివుని) గూర్చి తపమాచరించుటకై పోయెను. అక్కడ గాలికిం డుల్లు పండుటాకులను నాహారంబుగాఁ గొనుచు ఘోరమైన తపస్సుచేయుటకు నారంభించెను.

ఇట్లుండఁగా నొక్కనాఁడు కృష్ణాజినము ధరించి నెంద్రుకలు జడలుకట్టిన యొక బ్రాహ్మణబ్రహ్మచారి వచ్చి పార్వతి యెదుట నిలిచెను. పార్వతి యావటువునకు నతిథిసత్కారము చేయఁగా దాని నాతఁడు ప్రీతితో నం గీకరించి యామె మొకమువంకఁజూచి "ఓ తరుణీమణీ! ఈ ఘోరమగు తపస్సుచేసి నీ సుందర సుకుమారశరీరము నేల దహింపఁ జేసెదవు ? అఖిల ధర్మసాధనములకు నాద్యమగు సాధనము శరీరమని వినవా? నీరూపయౌవన లావణ్యమునకుఁ దగిన పీతాంబరములను మణిభూష ణములను దొలఁగబెట్టి, ఈ నారచీరల నేల కట్టితివి?

నీతండ్రిగృహంబున నీకవమానంబు గలుగదు గదా! మఱి నీవు దేవలోకనివాసంబున కాసపడుదువేని, యది వృథాప్రయాసము. ఏలన నీవుట్టినిల్లె దేవభూమి. ఇఁకఁ దగిన వరునిఁగామించి తపస్సు పూనితివేని నదియు నీకుఁ దగదు. ఏలన రత్న మొరునిచే నన్వేషింపఁబడును గాని యొరుని నన్వేషింపదు. నీనిట్టూర్పుగాడ్పులు నీయందు దుర్లభ జనానురాగంబు దగిలి యున్నట్లు తెలియఁజెప్పు చున్నవి. అట్టి కఠినహృదయుం డెవ్వఁడో? ఎవ్వఁడైన నేమి? నీవు జటాభారంబు ధరియింపఁదగదు" అని యంతటితో నిలుపక "సుందరీ! నేనును బ్రహ్మచారిని నీవును గన్యవు, నన్నుఁ బెండ్లాడుము." అని పలుకఁగా గౌరి యీబ్రహ్మచారికిఁ దన మనోరథముఁ దెలుప నోల్లక, పార్శ్వమున నున్నచెలికత్తెను జూడఁగా నామె చెలియింగితమును గ్రహించి యాబ్రహ్మచారితో "అయ్యా! మాచెలిహృదయము సోమకిరీటుఁడగు మహేశ్వరునిమీఁదఁ దగిలియున్నది. అతనినే పతిగాఁగోరి తపస్సు చేయుచున్నది." అని చెప్పెను. అందున కా కపటవటుఁడు గౌరినిజూచి నవ్వుచు "రాయంచయంచు గల పట్టుచీరలఁగట్టి, పద్మరాగ పదకములతోఁ గూడిన ముక్తాహారములు మెడలో వేసికొని, కమ్మని సువాసనలు గుబాళించు హరిచందనాదులు మేన నలంది,

రమణీయ మందిరారామముల నడయాడు సుకుమారశరీరవునీవు. నీవు కోరువరుఁడో పచ్చియేనుఁగుతోలు పచ్చడము గప్పికొని, పెనుబామును హారముగా ధరించి, తెల్లని విబూదిని బూఁతగాఁబూసికొని, శ్మశానభూమిలో వసియించు నంతకారి. వానికిని నీకును నేమిట సాటియున్నది. వాఁడు ముదిగొడ్డునెక్కి బిక్షాటనంబుచేయునఁట. ఇట్టి వానిని మానవతివగు నీవు పెండ్లాడిన లోకంబు వారలు నవ్వరా? ఇంతకుఁ బాణిగ్రహణవేళ వానిమెడలోని పాము బుస్సుమని నీమొగముమీఁదికి వచ్చిన నీ వేమిచేయఁగలవు? వానికి మూఁడు కన్నులఁట. ఇట్టి ముక్కంటిని నెట్టివెట్టి దయినను జేపట్టదు. ఇటువంటి వానిని నేటిమగఁడని కామించితివి? చాలుఁజాలు నీతపస్సు." అని శంకరుని దూఱనాడెను. గౌరి యీవంకర కొంకర మాటలకు సహింపక జయవిజయులను జూచి "పలుమాటలేల? తొలఁగి పొమ్మని చెప్పుఁడు." అని కోపముతోఁ బలికి మోముఁ ద్రిప్పికొని నాలుగైదడుగులు పోయి మరల వెన్కఁజూచెను. అప్పుడు సోమకిరీటుఁడును భుజగభూషణుఁడునునగు శంకరుఁడు సాక్షాత్కారమాయెను. కృతక బ్రహ్మచారి రూపమున వచ్చిన యాతఁడు శంకరుఁడే. ఇట్లు శంకరునిఁ జూచినదై గౌరి యట్లనిలిచెను. శంకరుఁ డామెచెంతకుఁ బోయి యామె

హస్తమునుబట్టుకొనెను. గౌరికి లజ్జయు, సంతోషమును, బశ్చాత్తాపమును బెనఁగొనెను. అంత శంకరుఁడు "రమణీ! నేనన్యుఁడనుగాను ; నీవాఁడనే. నీ తపస్సున కమ్ముడుపోయితి, నన్నేలుకొమ్ము" అనిపలుకఁగా గౌరి "ఈశ్వరా! నేను గన్యను, పితృపరాధీనను, వివాహమగుటకుఁ దండ్రియనుజ్ఞ గావలయును," అని సిగ్గుతో విన్నవించెను. అందులకు శంకరుఁ 'డట్లేయగునుగాక' యని కైలాస శిఖరమునకుఁ బోయి సప్తర్షులం బిలిపించెను.

## V

సప్తర్షు లరుంధతీ సమేతులయి కైలాసమునకు వచ్చిరి.

కం॥ "ఋషులఁ జూడ శివునకు
దారపరిగ్రహము వెంటఁ దన్మయుఁ దగిలెఁ
దార పరిగ్రహమే కద
సారపు ధర్మములకెల్ల సాధన మరయన్"॥

ఈశ్వరుఁడు వారికి సత్క్రియ లాచరించెను. వారును వానిని నాదరపూర్వకముగా నందుకొని "మమ్ము నేపని పంపున రావించితిరో సెలవిం"డని యడుగఁగా నందున కాతఁడు "మునీంద్రులారా! గౌరిని ధర్మపత్నిగా నభిలషించినాఁడను. నాకొఱకు మీరు

స్థితిమంతుఁడును, అభ్యున్నతుఁడును, వసుంధరాభారధూ
ర్వహుఁడును నగు పర్వతేశ్వరునియొద్దకుఁ బోయి యీకా
ర్యమును సంఘటింపవలయును. అరుంధతీదేవియు నీ
కార్యమునందు సాయపడును. ఇది శుభముహూర్తము
గాన నిప్పుడే యోషధిప్రస్థపురమునకుఁ దరలవలయును.
ఈకైలాసముననే పునస్సమాగమ మగునుగాక." అని
శంకరుఁ డానతిచ్చెను. సప్తర్షులు మహాప్రసాదమని
యరుంధతీ సహితముగా వెడలి యోషధిప్రస్థపురముఁ
జేరిరి.

పర్వతేశ్వరుఁడు వారి నెదురుకొని యర్ఘ్యపాద్యా
దుల నొసంగి, యంతఃపురమునకుఁ దోడ్కొనిచని, యు
చితాసనంబులఁ గూరుచుండఁబెట్టి, కుశల ప్రశ్న పూర్వ
కముగా వారితో "మేఘోదయములేని వానపగిది మీరు
వచ్చితిరి, నాగృహము పరమపావన మయ్యెను. వచ్చిన
కార్యమేమో యానతీయ వలెను," అని పల్కఁగా నంగి
రసముని (సప్తర్షులలో నొకఁడు) తక్కినవారి యను
మతిమీఁదఁ బర్వతేశ్వరునకిట్లనియె. "రాజేంద్రా! ఈశ్వ
రుఁడు నీకూఁతును భార్యగాఁ జేకొనఁదలఁచి మమ్ములఁ
బనిచినాఁడు. మేము మీకుఁ బెండ్లిపెద్దలము." అనఁగా
విని పర్వతేశ్వరుఁడు "గగన మునులారా! తగిన వరునకుఁ
గన్యకాదాన మిచ్చుటకంటె నితరభాగ్య మేమున్నది?

ఈకార్య మవశ్యము కావచ్చును.'' అని చెప్పి తల్లి దగ్గర నిలుచున్న కూర్మితనయను సమీపించి "తల్లీ! నీతపస్సు నేఁడు పూర్ణముగ ఫలించినది. పెండ్లి పెద్దలయిన గగన మునులకును నరుంధతీదేవికిని మ్రొక్కుము.'' అని చెప్పెను. అప్పు డాబిడ్డ యందఱకునమస్కరించి, యంజలి ఘటించి, లజ్జాభారమునఁ దలవంచినిలఁబడెను. అందఱును నామెను నాశీర్వదించిరి. అంత నరుంధతీదేవి గౌరిని నల్లనఁజేరఁదీసి తనయొడిలోఁ గూరుచుండఁ బెట్టుకొనెను, గగనమునులు వివాహముహూర్తము నాటికి నాల్గవ నాఁడని నిశ్చయముచేసి యరుంధతితోడఁ గైలాసము నకుఁజనిరి. శంకరుఁడు మూఁడుదినము లెట్టెటో గడపు చుండెను.

అట నోషధిప్రస్థపురము కడుశృంగారముగా నుండెను. ఇరుగడల జోడులవలె వరుసదీరియున్నట్టియు, నిగనిగలాడు నాకుజొంపములు గలట్టియు, వృక్షముల యొక్క నీడలకదలికచే రాజమార్గములు హాయిగను రమణీయముగను నుండెను. తెల్లనిపట్టువస్త్రపుఁ బతాక లెల్లెడల వెలయుచు గాలికిఁ దిన్నఁగ నల్లాడుచుండి నవి. గొప్పకంబములకుఁ గట్టిన కాంచనతోరణములు తళతళ లాడుచుండెను. ప్రతిగృహమును ద్వారపర్యం తము చిత్రవిచిత్రములగు పుష్పమాలికలచే సంధానితమై

సుందరముగనుండెను. బహిర్ద్వారములు కలువడములచేఁ బన్నఁబడి, శోభాయమానముగా నుండెను. పుర మంతయుఁ గమ్మనిసువాసనలచే గుబాళించుచుండెను.

పెండ్లిదినమున నోషధిప్రస్థపుర మంతయు నొక్క యిల్లువలె సంభ్రమించు చుండెను. మంగళవాద్య ఘోష మిన్నుముట్టుచుండెను. యక్ష కిన్నర గరుడ గంధర్వ సిద్ధ విద్యాధరాంగనలచే నిండి, పురము విరాజిల్లుచుండెను. కొందరు ముత్తైదువలు గౌరికి మంగళ స్నానంబు గావించి యగరుధూపముల నొసంగిరి. జయవిజయ లామెకు మణిభూషణంబులఁ దొడిగి శంకరుని కిరీటమందలి బాలచంద్రుని ముట్టుమని బోధించిరి. మేనకాదేవి బిడ్డమొగంబు లేవనెత్తి కన్నులకుఁ గాటుక రచించి, లలాటభాగమున సిస్తుగాఁ గస్తూరితిలకంబు తీర్చిపెట్టి, ముంజేతికిఁ గంకణముఁగట్టెను. అప్పుడు మేనకాదేవికిఁ గన్నీరు జొటజొల స్రవించెను. అంత గౌరి కులదేవతలకుమ్రొక్కి, ముత్తైదువలను బూజించెను. అటుపిమ్మటఁ బ్రమదాజనంబులు గౌరిని కల్యాణమండపమునకుఁ దోడ్కొనిపోయి, వివాహవేదిక మీఁద గూరుచుండఁబెట్టఁగా నామె గూరుచుండి శంకరుని రాకకై యెదురుచూచుచుండెను.

సప్తర్షు లరుంధతీ సమేతులయి మంగళద్రవ్యములు సంతరించుకొని వెంటరాఁగాఁ, బ్రమథపరివారము తన్నుఁ బరివేష్టించి నడువఁగా మహేంద్రాది దేవతలు గొలుచుచుండఁగా, హరిబ్రహ్మలు వేత్రహస్తులై యిరుగడలనుండఁగా, శంకరుఁడు నందివాహనము మీఁద నోషధిప్రస్థపురమునకువచ్చి, తత్సమీపముననున్న యొక వనమునందు దిగెను. పర్వతేశ్వరుఁడు బంధు మిత్ర పరివారముతోడఁ గదలి శంకరు నెదురుకొని, మేనకాదేవి బంగారుగిండుల జలముపోయగా, నల్లునిపాదములు గడిగి, కల్యాణమండపమునకుఁ దోడ్కొని వచ్చి, వివాహ వేదికమీఁదఁ గూరుచుండఁబెట్టెను.

పార్వతి కుదురుగఁ దలవంచి కూరుచున్నదయి తన కాలియందెలందుఁ బ్రతిబింబితమైన మనోవల్లభుని రూపమును జూచెను. అప్పుడు శంకరుఁడు కట్టుపచ్చి యేనుఁగుతోలుపచ్చడము సరిగంచుగలపట్టుచేలముగాను, మెడలోని పెనుబాము కమనీయమైన తారహారముగాను, మేనఁ దట్టముగఁబూసిన విభూతి పచ్చకర్పూరపుఁబూఁతగాను గనుపట్టెను.

అంత నాశుభలగ్నంబునఁ బర్వతేశ్వరుఁడు శంకరునికి యథావిధిగాఁ గన్యాకాదానము చేసెను. సకల

లోకంబులవారలు సంతసిల్లిరి. పార్వతీశంకరులు సంకల్ప సిద్ధిఁ బొందిరి.

అటుతరువాత మహేంద్రాది దేవతలు మన్మథుని బునర్జీవింపఁజేయ శంకరుని బ్రార్థింపఁగా, నతఁడు భస్మీభూతుఁడై యున్న పుష్పబాణుని బునర్జీవింపఁజేసి, మును పటికంటె మిక్కిలి యున్నతునిగాఁ జేసెను. రతీదేవి పరమానందముం బొందెను. మహేంద్రాది దేవతలు మిక్కిలి సంతోషించిరి. వసంతుఁడును దనప్రాణమిత్రుఁడు బ్రదికెనని సంతోషము పట్టలేక గంతులువైచెను.

# సీతాకల్యాణము

గంగానదికుత్తరమున హిమవత్పర్వత సమీప మున విదేహమను దేశమొకటిగలదు. దానికి రాజధాని మిథిలాపురము. బహుకాలము క్రిందట నీదేశమును మహాధార్మికుఁడయిన జనకుఁడను రాజు పాలించుచుం డెను. ఇతఁడొక యజ్ఞమునుజేయ నుద్యమించి నేలను దున్నుచుండఁగా నందొక స్త్రీశిశువు కనఁబడెను. జనక మహారాజాబిడ్డనుగాంచి, యాశ్చర్యపడి సంతోషముతో నెత్తుకొని తనజ్యేష్ఠభార్యకడకు వచ్చి యామె యొడిలోఁ బెట్టెను. అప్పటి కింకను వారికి బిడ్డలు లేకపోవుటచేత, ఆబిడ్డను మిక్కిలి గారాబముతోఁ గన్నబిడ్డవలె వారు పెంచుకొనుచుండిరి. నాగఁటిచాలున దొరకిన కారణ మున, నాబిడ్డకు 'సీత'యని నామకరణంబుచేసిరి. సీత యనఁగా నాఁగటిచాలు.

సీత మిక్కిలి యదృష్టవంతురాలు. ఆమె యదృ ష్టము రాజునకును సోఁకెను. అబిడ్డ జనకునిల్లు సొచ్చి నది మొదలు విదేహదేశము పాడిపంటలతోఁ బెంపార సాగెను. ఇంతేకాక, రాజు జ్యేష్ఠభార్య గర్భవతియై

యొక కొమార్తెనుగనెను. ఈబిడ్డకు 'ఊర్మిళ'యని పేరు పెట్టిరి. సీతయు, ఊర్మిళయు నొక్కకడుపునఁ బుట్టిన బిడ్డలాయనునట్లు సమానమగు రూపరేఖావిలాసములు గలిగి యేకముగాఁ బెరుఁగుచుండిరి.

ఈబాలికల కొండొరుల మీఁదఁగల యనురాగ మింతింతని చెప్పనలవికాదు. వారెందుఁ బోయినను నొకతెను విడిచి యొకతె పోవుటలేదు; వారేపని చేసినను నొకతెనువిడిచి యొకతెచేయుటలేదు. వారు ప్రతిదినము తెల్లవారునలేచి, యుదయకాలకృత్యములఁ దీర్చుకొని నడుములఁ జిన్న బంగారుబిందెల నిడికొని యుద్యానవనమునకుఁ బోయి తాము పెంచు లతలకు నీరు పోసి, పడపడి పెంపుడు లేడిపిల్లలకుఁ, జేతులతో నిమిరి తట్టి, యాహార మిడుచుందురు.

సాయంసమయములందు వారిరువురు నిర్జనస్థలములకుఁ బోయి యక్కడ నన్యోన్య సరససల్లాపములతోఁ గాలముగడపుచుఁ గూరుచుందురు. ఒక్కనాఁటి సాయంకాలమున నుద్యానవనమునందలి తామరకొలని గట్టుమీఁదఁ గూరుచుండి దానిసౌందర్యమును, జలమున నీఁదులాడి యొడ్డునకువచ్చి శరీరము విదుల్చుకొని నడయాడు రాయంచల నడబెడంగును జూచి కొనియాడు చుందురు. ఇంకొక్కనాఁటి సాయంకాలమున నూరి

కుత్తరపు దిక్కుననుండు గుట్టల నెక్కుదురు. ఎక్కుచో వడిగా గంతులువైచుచుఁ బాలుసెలయేళ్ళయందు విహరించుచు, దారిలో నందందువచ్చు గవుల సమీపించి యెలుగెత్తి కేకవేయఁగాఁ గలిగెడి ప్రతిధ్వనులకు నలరుచు, సంధ్యారాగముచే నలంకరింపఁబడిన శిఖరములకుఁ బోయి యందముఁ గూరుచుండి, మేఁకలను మేపుకొనుచు నందందునుండుగొల్లవాండ్ర బ్రదుకును గుఱించియు, మేఁకల జీవనమును గుఱించియు, మఱి యెన్నోయితర విషయములను గుఱించియు సల్లాపములు సలిపి, యా వెనుక గుట్టదిగి యింటికిఁ బోవుచుందురు.

ఆటలయందువలెఁ చదువులయందును వారి కాసక్తిమెండు. వారు తగినగురువులయొద్ద నెల్లవిద్యల నేర్చుచుండిరి. గానము, చిత్రలేఖనము, కవితారచనము, వీణాది వాద్యముల వాయించుట, మొదలగు శృంగార కళల యందును నిపుణలగుచుండిరి.

## II

ఇట్లుండఁ గాలక్రమమున నాబాలికలిద్దఱు యౌవనదశను బొందిరి, సీత కడురూపసి. చక్కనివారిలో మిక్కిలి చక్కనిది. ఆమె చక్కఁదనమునకుఁ దోడుగా సుగుణసంపత్తియు నుండెను. ఆయువతి సౌందర్యా

తిశయమునుజూచిన రాజన్యులు కొందఱు, ఆమెను బాణి
గ్రహణము చేసికోవలెనని ముచ్చటపడి, యామె తండ్రి
యగు జనకమహారాజును వచ్చివేఁడిరి. లోకోత్తర పరా
క్రమ వంతునకు సీతనీయ నిశ్చయించినవాఁడగుటచే
జనకుఁడు వారికిఁ దనయొద్దనుండు శివుని ధనుస్సును
జూపి "ఈచాపము నేరాజన్యుఁడు మోపెట్టునో యా
తనికి నాకూఁతునిచ్చెద" నని చెప్పెను. వచ్చిన రాజ
నందను లాకోదండమును గదల్పనైనను లేక సిగ్గుపడి
వెడలిపోయిరి.

జనకమహారాజు, హరువిల్లునెక్కిడు రాజన్యు
నకు లోకోత్తరసుందరరూపయగు సీత యీఁబడుననన్న
సంగతి సకలదేశములవారికెఱుంగునట్లుగాఁ జాటించెను.
దిగ్దేశముల నుండి రాజన్యులు తండోపతండములుగా
వచ్చుచుండిరి. కోదండము నెత్తఁబోయి రాజనందనులు
కొందఱు చేతులు విఱుచుకొనిరి; కొందఱు కాళ్ళు విఱు
చుకొనిరి. ఇట్లవమానపడిన పుడమిఱేఁడులు సాంకాశ్య
పురాధీశుఁడగు సుధన్వునిఁ బురస్కరించుకొని రణరంగ
మున మిథిలేశు నోడించి, సీతను, సీతతోఁగూడ హరుని
చాపమును, నెత్తుకొని పోవలెనని నిశ్చయించినవారయి,
సైన్యములఁ గూర్చికొని మిథిలాపురముపై వెడలిరి.అంత
లోపల మిథిలేశుఁడు తన చతురంగబలముల వృద్ధిచేసి

కొని శత్రువులఁ దాఁకుచు రాఁగ, వారిబలంబులు నానాఁటికి సన్నగిల్లె. పోరు ఘోరముగా నొక సంవత్సరము జరిగె. తుదకు సుధన్వుఁడోడింపఁబడి చంపఁబడియె. ఇతర శత్రురాజులు పలాయితులయిరి. యుద్ధములోఁ దనకుఁ గుడిభుజముగానుండి మిక్కిలి సాయపడిన పినతమ్ముఁడగు కుశధ్వజుని, సాంకాశ్య పురాధీశునిగాఁ జేసెను. మిధిలేశుఁడు తన విజయమునకు మిగుల నుప్పొంగి, యుద్ధము ముగిసిన కొన్ని వాసరములకు యజ్ఞము మఱియొకటి చేయ నుద్దేశించి సమస్తరాజవరులను ముని బృందములను నాహ్వానము చేసెను.

## III

హరుని ధనుస్సు మోపెట్టఁజాలిన వీరాగ్రేసరుఁడు సిద్ధమగుచుండెను. ఆవీరాగ్రేసరుఁ డెవఁడు? ఆతఁడు సూర్యవంశమునఁ బుట్టిన దశరథుని జ్యేష్ఠపుత్రుఁడగు రాముఁడు. రాముఁడు, విశ్వామిత్రు నొద్దఁ దదాశ్రమంబున, ధనుర్విద్య నభ్యసించుచుండెను. తోడునీడవలె నన్న నెప్పుడు నెడఁబాయని లక్ష్మణుఁడు సహితము రామునితోఁ బాటు విలువిద్దె నేర్చుచుండెను. ఈ యన్నదమ్ములిద్దఱు తమ గురువునొద్ద నొక్క ధనుర్విద్యనే కాక సకల విద్యలను నభ్యసించుచుండిరి. శిష్యులు కుశా

గ్రిబుద్ధిగలవారు కాఁబట్టి, యనతికాలముననె సర్వవిద్యా పారంగతులైరి. విశ్వామిత్రుఁడు, తనశిష్యులను లోకానుభవజ్ఞులనుగాఁ గూడ జేయుట యావశ్యకమని యెంచి, వారిని వెంటఁగొని, దేశసంచారము వెడలెను.

రామ లక్ష్మణ విశ్వామిత్రులిట్లు పయనమయి కొన్ని ఋష్యాశ్రమములకుఁ బోయిరి. మిథిలాపురమున యజ్ఞము జరుగునని విని యక్కడకుఁ బ్రయాణమయిన కొందఱు మునులు, విశ్వామిత్రుని రాజతనయులతోడ నాయధ్వరమునకు రమ్మని వేఁడఁగా నాతఁడందులకొప్పుకొనెను. అందఱును మిథిలాపురంబునకుఁ బయనించిరి. దారినివచ్చు గంగానదిని బడవలనెక్కి దాఁటి విశాలానగరంబుఁ బ్రవేశించిరి. అప్పుడు విశాలానగరమును సుమతి యను రాజు పాలించుచుండెను. సుమతి వచ్చిన యతిథులకు సపర్యలొనర్చి పూజించెను. అందఱారేయి యక్కడఁగడపి వేకువనులేచి మిథిలాపురంబు చేరువనున్న గౌతమాశ్రమమునకుఁ బోయిరి.

అది రమణీయమయ్యు నిర్మానుషముగా నుండెను. రాముఁడు తత్స్థల మాహాత్మ్యమేమియని విశ్వామిత్రు నడుగఁగా, నతఁడు పూర్వము గౌతముఁడను మహర్షి తన భార్యయగునహల్యతోఁ గూడి యక్కడ నివసించుచుండెననియు, అహల్య చేయరానిపని యొకటి చేయఁగా

భర్త యామెను శపించెననియు, పతిశాపముచేత నామె నల్లని మేఘముల మఱుఁగుననుండు చంద్రబింబమువలె నెవ్వరికిఁ గానరాక, రాయివలెఁ గదలమెదలలేక, యాశ్రమము లోపలఁ బడియున్నదనియు, తన్ను దర్శించుటవలన నామెకు శాపబాధ తొలఁగిపోవుననియు, నాకథనంతయుఁ జెప్పి రామ లక్ష్మణులను లోనికిఁ గొనిపోయెను. అహల్య రాముని దర్శించినతోడనే నిజరూపముం బొంది నిలఁబడెను. రామ లక్ష్మణు లామునిపత్నికి మ్రొక్కిరి. ఆమునిపత్ని తనకు శాపవిముక్తికిఁ గారణభూతులైన యామహానుభావులకును మునిబృందమునకును నాతిథ్య సత్కారంబు లాచరించి వారిని దృప్తిచేసెను. అంతె నామెభర్త యెటనుండియో వచ్చి నిజతపోబలముచేతఁ బరిశుద్ధురాలయిన భార్యను స్వీకరించెను.

రామలక్ష్మణులు విశ్వామిత్రాదిమునులు నాదిన మంతయు గౌతమాశ్రమమున నుండి, వఱువాత లేచి స్నానముచేసి యాహ్నికములఁ దీర్చికొని, మిథిలాపురంబున కీశాన్యభాగముననుండు యజ్ఞముచేయు తోఁట దిక్కుగా నడిచిరి.

## IV

జనకమహారాజు విశ్వామిత్రాది మహామునులరాక విని సంతోషపడి పురోహితుఁడగు శతానందుఁడును,

మంత్రివరులును, దనవెంటరాఁగ వారినెదురుకొని సత్క రించి పూజించెను. కరవాల తూణీర శరకోదండ ధారు లయి వెంటనున్న నవయౌవను లెవరయినది విశ్వామిత్రు నడిగి వారినిగుఱించి పూర్ణముగాఁ దెలిసికొనెను. అటు పిమ్మట జలము సమృద్ధముగా నుండునట్టియు జనకల కలము లేనట్టియు యజ్ఞవాటికాభాగమున విడుదులలో వారిని విడియించి, మునులయనుజ్ఞ పొంది, శతానందా దులతో మరలెను. విశ్వామిత్రాది పరమమునులు కొంచెము నిదానించి రామలక్ష్మణులతో యజ్ఞశా లకుఁ బోయి, లోపలఁ బ్రవేశించి యుచితాసనంబులఁ గూరుచుండిరి.

ఆ యజ్ఞశాల తోఁటమధ్యమునఁ గలదు. అది సువిశాలమైనది. దానిలో నొక్కతట్టు పరమమునులు దర్భాసనంబుల వరుసలుదీరి కూరుచుండియుండిరి. ఇం కొక్కయెడ రాజవరులు సముచితాసనంబుల నలంక రించి యుండిరి. వేరొక్కవైపు బ్రాహ్మణశ్రేష్ఠులు సామగానంబు సేయుచుండిరి. యజ్ఞశాల మధ్యమున యాజకులు హవిస్సును మంత్రపూర్వకముగా వేల్చు చుండిరి. హోమధూమము మేఘములఁబోలి బయలు వెడలుచుండెను. పాలకుండలు, పెరుగుకుండలు, నేతికుం డలు మొదలగు యజ్ఞసామగ్రి వేదికలమీఁద విలసిల్లు

చుండెను యజ్ఞపశువులను వరుసగాఁ బాలకొయ్యలకుఁ గట్టియుండిరి. యజ్ఞవాటిక కడు మనోహరముగా నుండెను.

కతిపయదినములకు యజ్ఞము సాంతమాయెను. ఆ మఱునాఁడు కొలువుకూటమున సభజరిగెను. అధ్వరమునకువచ్చిన వారందఱును నక్కడ సమావేశులయిరి. అప్పుడు పెక్కండ్రు బలాఢ్యులగుభటులు లోకపేటికను మోసికొనివచ్చి జనకమహారాజు నెదురుగఁబెట్టిరి. జనకమహీపతి తనపీఠమునుండి లేచి పెట్టెమూతఁదీసి సభవారి నుద్దేశించి "మహానుభావులారా! ఇయ్యది హరుని కోదండము. దక్షాధ్వరమున దేవతలు యజ్ఞభాగమును హరున కీకపోవుటచేత, హరుఁడు రోషపడి యీధనుస్సుచేత వారిని బలియియ్యఁ జూడఁగా వారు భయపడి, తమ తప్పిదము నొప్పుకొని క్షమింపవేఁడిరి. హరుఁడును గరుణించి వారికభయమిచ్చుచు, నాధనుస్సును వారి కొసంగెను. వారు నాపూర్వుఁడగు రాజునకిచ్చిరి. అది పరంపరగా నాకు వచ్చినది. మాగృహంబు సొచ్చినది మొదలుగా నిది నిత్యపూజల నందుచున్నది. దీని నెత్తి మోపెట్టు రాజన్య చూడామణికి నానందనయగు సీతను, విద్యావినయ సుగుణసముపేతను, నిచ్చెదనని ప్రతిజ్ఞచేసినాఁడను. రాజేంద్రులారా! భుజబల ధౌరేయులారా!

మీ బాహుబలములఁ జూపవచ్చును." అని చెప్పి కూరుచుండెను. అంత గుసగుస లారంభమాయెను. రాజుల గుంపున మునిబృందము వైపునఁ గూరుచున్న రామునిఁ జూచి విశ్వామిత్రుఁడు కనుసైగచేసెను. రాముఁడు లేచి మందసము సమీపమునకు వెళ్ళెను. రాజులంద ఱొండొరుల మొగంబులు చూచికొనిరి. ఈబాలుఁడేమి సురాసురులకైన నెత్త సాధ్యముకాని యాధనువు నెత్తుట యేమి యని రామునిఁ దూలనాడిరి. రాముఁడు కోదండమును దాఁకిచూచి, యిరుగేలఁ దాని నవలీల నెత్తి క్రింద నిల్పి, దానికిఁ దొడిగి యున్న గవుసెనను దొలఁగఁద్రోచి, యల్లెత్రాటి నమర్చి టంకార మొనరింపఁజొచ్చెను. అందఱు నాశ్చర్య మగ్నమానసులైరి. రాముఁడు కోదండమును ముష్టినిబట్టి యెత్తి తెగ నధికముగాలాగెను. అంత నాకార్ముకము ఫెళ్ళని ఘోరశబ్దముతో విఱిగెను. రాముఁడు, లక్ష్మణుఁడు, విశ్వామిత్రుఁడు, జనకుఁడు,వీరు తప్ప నాస్థానము వారెల్ల నాశబ్దమునకు భయవిహ్వలులయిరి.

మ॥ ధనువుద్యద్గతి రాముఁడట్లు విఱువం
తద్ఘోర ఘోషంబొగిన్
ఘనని ర్ఘాత నిపాతజాత నినదో
గ్రధ్వానమై మ్రోసినన్

ఏని యాస్థానమువార లెల్లనడిఁ
బృథ్వింద్రెళ్ళి మూర్ఛిల్లిరా
జనకాధీశుఁడు రామలక్ష్మణులు వి
శ్వామిత్రుఁడుం దక్కఁగఁగ.

విశ్వామిత్రుఁడు లేచివచ్చి రామునిఁ గౌఁగిలించుకొనెను. జనకుఁ డచ్చెరువంది, మనస్సునందు సంతోషముప్పొంగఁగా లేచి "రామచంద్రుని బాహుబలమత్యంతము, అసదృశము, అతివిస్మయము, అమోఘము. మహానుభావులారా! మాసీతను దశరథ నందనుఁడగు నీ రామచంద్రునకు భార్యగా నిచ్చెద. వివాహముహూర్తమనతికాలముననె నిశ్చయింపఁబడును. మీరు వధూవరులను దీవించి మఱి పోవుదురని వేఁడెద." అని వచించి, పిమ్మట విశ్వామిత్రునితట్టు తిరిగి "మునిచంద్రమా! మీరాకకతమున నేను ధన్యుఁడనైతిని. నాకులము పవిత్రమయ్యె"నని నుడివెను. అంత సభముగిసెను. అందఱుఁ దమతమ నివాసంబులకుఁ జనిరి.

ఆ వెనుక మిథిలేశుఁడు విశ్వామిత్రు ననుమతిచేతఁ దగినమంత్రులం బిలిపించి మీరు దశరథు నొద్దకుఁ బోయి, యమ్మహీపాలునకు నిక్కడ జరిగిన వృత్తాంతమెఱిఁగించి లగ్ననిశ్చయంబుచేసి తోడ్కొనిరండని చెప్పి పంపెను.

## V

లగ్నము నిశ్చయింబుచేయఁబడి పత్రికటింపఁ
బడెను. మిథిలాపుర మలంకరింపఁబడి మిక్కిలి మనో
హరముగానుండెను. అన్నిదిక్కుల నుండి జానపదులు
వచ్చి మూఁగిరి. పెండ్లికుమార్తె పక్షమువారి బంధువు
లును మిత్రులును వచ్చిదిగిరి. యజ్ఞమునకు రాకనిలిచిన
జనకుని తమ్ముఁడగు కుశధ్వజుఁడు, తనపుత్రికలఁ దో
డ్కొని పరిమిత పరివారముతో సాంకాశ్యపురమునుండి
వచ్చిదిగెను. పెండ్లిదినమునకు ముందునాఁటి యుదయ
మున సామంతులు, మంత్రులు, వసిష్ఠాది మునులు వెంట
రాఁగ, గొప్ప సైన్యముంగొని, భార్యలతోడను, పుత్రుల
తోడను, బంధువులతోడను, దశరథుఁడువచ్చి మిథిలా
నగరంబు సమీపముననుండు నారామములో విడిసెను.
జనకుఁడు తమ్మునితోడను శతానందాది మునులతోడను
వెళ్ళి వియ్యంకుల నెదురుకొని, వారిని గొనిపోయి తగిన
చోట విడియించి, సన్మానించి, దశరథునితో "రాజతిల
కమా! నాభాగ్య విశేషమున మిమ్ములను వసిష్ఠామల
మునీంద్రులను జూడఁగలిగితిని. మఱియు రవివంశ సామ
లతో వియ్యమందఁగంటి. ఈబాంధవముచేత నగళ ద్రివ్య
పావనమయ్యె,"నని పలికెను. అంతలో ·ం నరుదెంచి
ణులు విశ్వామిత్రుఁడును జనుదెంచిరి. బ్ర[illegible]మునిరాజులు,

తండ్రికిని దల్లులకును వసిష్ఠాది మునులకును మ్రొక్కి వారిదీవనలందిరి. తరువాతశతానందుఁడు దశరథునిజూచి "మీకుమీకు సరిసరియైన బాంధవము సమకూరినది. మీరు పెద్దమనసుచేసి యూర్మిళను లక్ష్మణునకును, కుశ ధ్వజుని ముద్దుకూఁతులగు మాండవీశ్రుతకీర్తులను భరత శత్రుఘ్నులకును జేసికొవలె"నని యడిగెను. వసిష్ఠ విశ్వామిత్రులు "ఇక్ష్వాకు విదేహావంశముల బాంధవ మీసంబంధములచే మఱింతబలపడుట మాకెంతయు సమ్మతము" అని నుడివిరి. దశరథుండును నందుల కొప్పుకొనెను. రాముని తల్లియగు కౌసల్యయు, లక్ష్మణ శత్రుఘ్నుల జననియగు సుమిత్రియు, భరతుని మాత యగు కైకయు మిక్కిలి సంతోషపడిరి. జనకుఁడు కృత నిశ్చయుఁడై యుల్లాసముతో సపరివారముగ నగరునకుఁ బోయెను.

నగరు వికాసముగలిగి మిక్కిలి సంతోష సంభ్రమములతో భాసిల్లుచుండెను. సుందరీమణు లేదో యొక అంద కల్పించుకొని యుత్సాహముతోను సంబరముతోను గలం దిరుగాడు చుండిరి. రాముని బరాక్రమమును దగినమంత్రకలు కొందఱాతనినిఁ గనులారఁ జూచినవారి బోయి, య వగా వర్ణించుచుండిరి. మఱికొందఱు బాలి మెఱిఁగించి కూఁతులను ముఖ్యముగా సీతను జూడవలెనని పంపెను.

కుతూహలపడి యామెకై వెదకుచుండిరి. అందఱి కన్నులకు మిక్కిలి ప్రియమైన సీత యొంటిపాటున నొక్కగదిలో నుండెను. సీత పసిదిగాదు. ఆమెకుఁ బెండ్లియన్ననేమో తెలియును. పెండ్లివలనఁ గలుగు మార్పును గుఱించి యామె తలపోయు చుండెను. ఆమె మనస్సాకప్పుడు స్పష్టముకాని యొకవిధమగు భయముచేతఁ గళవళపడుచుండునట్లు లామె ముఖభావము సూచించుచుండెను. వెంటనే మోమున మొలక నవ్వులరుచుండెను. ఇట్లుండఁగాఁ గొందఱు బాలికలువచ్చి "పెండ్లికూఁతురిదిగో! పెండ్లికూఁతు రిదిగో!" అని యఱచి పరధ్యానమునుండి యామెను మేలుకొలిపిరి.

## VI

మరుసటిదినము తూర్యాది మంగళధ్వనులతోఁ దెల్లవాఱెను. వధువుల పక్షమువారు ముందుగా వివాహమంటపమునకువచ్చి యొకవైపు కూరుచుండిరి. వరుల పక్షమువారు మణిమయ భూషణంబులును, కోమల దుకూలాంబరములును, మనోహరపుష్ప సుగంధ సామగ్రియు, నానావిధ ఫలంబులును, అనేక మంగళ ద్రవ్యములును గలయట్టి పసిఁడి పళ్ళెరములతో నరుదెంచి యొకయెడఁ గూరుచుండిరి. రాజులు, మునిరాజులు,

పౌరులు వచ్చి యథాస్థానములఁ గై సేసిరి. సీత, ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తి, వీరలు సర్వాభరణభూషితలై వధూ వేషమ్ముల నుండిరి. రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు కంకణహస్తులై యుండిరి. కృత్రిమపుష్పములతోఁ జిత్ర విచిత్రముగా నలంకరింపఁబడిన పెండ్లియరుగులు వెలుఁగుచున్న దీపములతోడను, ధూపయుక్తములగు ధూప పాత్రములతోడను, అర్ఘ్యలాజాక్షతలతో నిండిన హేమ పాత్రములతోడను, సువర్ణపాలికలతోడను, మూఁకుళ్ళతోఁగూడిన ఛిద్రకుంభములతోడను, స్రుక్స్రువములతోడను, అనేక మంగళద్రవ్యపూరితములగు బంగారు పళ్ళెరములతోడను, శోభిల్లుచుండెను. వసిష్ఠ విశ్వామిత్ర శతానందులు "ఇంకఁ దడవేటికి ? వధూవరులు రావలెను." అని హెచ్చరించఁగా రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు తమతమ వేదికలమీఁదికి నడచిరి. వసిష్ఠాది మునులు వేదికలమీఁద మంత్ర పూర్వకముగా దర్భలం బఱచి వాని మధ్యమున విధ్యుక్తముగా నగ్నినుంచిరి. జనకుఁడు వధువులను ముందిడుకొని వేదుల పొంతకు నడిచెను. సీతను నగ్నికెదురుగా రామున కభిముఖముగా నిలిపెను. ఊర్మిళను నట్లె లక్ష్మణున కభిముఖముగాను, మాండవిని భరతున కభిముఖముగాను, శ్రుతకీర్తిని శత్రుఘ్నున కభిముఖముగాను నిలిపెను. వధూవరులు

కడగంటిచూపులు సారించి యొండొరులఁ జూచికొనిరి. జనకుఁడు సీత కరమును రాముని కరమందుంచి మంత్రపూత జలముతో నామెను ధారవోసెను. తరువాత నూర్మిళను లక్ష్మణునకును, మాండవిని భరతునకును, శ్రుతకీర్తిని శత్రుఘ్నునకును నట్లె ధారవోసెను. దశరథ నందను లగ్నిసన్నిధిని వేదోక్త క్రమంబుగాఁ బాణిగ్రహణంబులుచేసి, పవిత్రమగు నగ్నికిఁ బ్రదక్షిణముచేసి నమస్కరించిరి.

ఇట్లు విధ్యుక్తముగా వివాహములు వెలసెను. ఆసమయమునఁ బూలవాన కురిసెను. దేవతలదుందుభులు మ్రోసెను. దేవతావనిత లాడిరి. గంధర్వ స్త్రీలు పాడిరి.

వివాహ మహోత్సవములు ముగిసిన మఱునాఁడు వచ్చినవారు పెక్కండ్రు ప్రయాణములు చేసిరి. విశ్వామిత్రుఁడు, వధూవర బృందమును, దశరథ జనకులను దీవించి, కృతకృత్యుఁడై హిమవత్పర్వత ప్రాంతమునకుఁ బయనమాయెను.

పెండ్లికూఁతులు పుట్టినిల్లు విడిచి తమ భర్తల వెంట నత్తగారింటికిఁ బోవుసమయ మాసన్నమాయెను. ఆపడుచుల కప్పుడు కలిగిన మనస్సంక్షోభము మిక్కుటము. తాము పెంచెడి యుద్యానలతలను, లేడిపిల్లలను,

విహారించిన పలుస్థలములను, పుట్టి పెరిగిన గృహమును, తల్లిదండ్రులను నెడఁబాసి చనుట దుఃఖకరము గదా! ఆపడుచులు తల్లులకును కుశధ్వజునకును వృద్ధులకును నమస్కరించిరి. పిదప వెలుపట నిలిచియున్న జనకుని దగ్గరకువచ్చి యాతనికి నమస్కరించి నిలిచిరి. ఆతఁడు బిడ్డలను జేరఁదీసి బుద్ధులుచెప్పి, సిద్ధమైనిలిచియున్న రథములయొద్దకుఁ దోడ్కొనిపోయి వారినెక్కించెను. తరువాత రామలక్ష్మణ భరత శత్రుఘ్ను లరుదెంచి తమ మామకుమ్రొక్కి, యాతని దీవనలఁ గైకొనివెళ్ళిరి. దశరథ జనకులు పరస్పరాలింగనము చేసికొనిరి. అంత దశరథుఁడు కొడుకులుఁ గోడండ్రును వెంటరాఁగ ఘనసైన్యము తన్నుఁ గొల్వఁగా, బంధు మంత్రి హిత పురోహితుల తోడను పురంధ్రులతోడను నయోధ్యాపురికిఁ బ్రయాణమాయెను.

# రుక్మిణీ స్వయంవరము

ఆకాలమున భీష్మకుండను రాజు, కుండిన నగరము రాజధానిగాఁగల విదర్భదేశము నేలుచుండెను. ఆతని కైదుగురు పుత్రులు నొక పుత్రికయు నుండిరి. వారిలో నగ్రజుఁడు రుక్మి; రుక్మిణి యందఱకును గడగొట్టు చెల్లెలు.

రుక్మిణి కడపటి బిడ్డయగుటచేతఁ దల్లికి నామె మీఁద మక్కువ మెక్కువ. ప్రతిదినమును దల్లియె బిడ్డకు జడవిప్పి, మెఱుఁగుపూసి, కురులు చిక్కులుదీసి, జడ యల్లికదీర్చి, మొగముకడిగి, కస్తూరితిలకంబు దీరిచిపెట్టి, మేలైన పట్టు చీరలఁగట్టి, తోటి రాచకన్నియలతోడ నాడవిడుచును.

ఒక్కొక్కప్పుడు రుక్మిణి తన నెచ్చెలులతోడ డాఁగురుమూఁత లాడును. ఒక్కొక్కనాఁడు నెచ్చెలులతో వియ్యమంది బొమ్మలపెండ్లిండ్లుచేసి గుజ్జనగూళ్ళను దోడివారికిఁ బెట్టించును. ఇంకొక్కనాఁడు రమణీయమైన యారామమునకు సఖులతో వెడలి పెద్ద వృక్షము కొమ్మలకుఁ గట్టిన తూఁగుటుయ్యేల లూఁగును.

ఇట్లు రుక్మిణి బాలికాక్రీడలచే సాయంసమయ

ములు గడుపుచుండినను, నితరసమయములందుఁగాలము వృథాపుచ్చక విద్యాభ్యాసము చేయుచుండును.

దినదినక్రమమున నామెకు బాల్యము జారెను. ప్రాప్త యౌవనయయ్యెను. పెదవి మునుపటివలె మాటలాడదు. కన్నుఁజూపు లరసిగ్గున మీఱెను. గమనము మందగతి వహించెను. నెమ్మోగము క్రొత్తయందమునఁ బ్రకాశించెను. సర్వాంగములు సౌష్ఠవమున శోభిల్లెను.

రుక్మిణి తన తండ్రిగృహమునకు వచ్చుచుండిన యతిథిజనుల వలనఁ గృష్ణుని గుణములను రూపసంపదను శౌర్యపరాక్రమమును విని, యాతఁడె తనకుఁదగిన మగఁడని మనస్సులోఁ దలపోసి, యాతనిమీఁదనె మది నిల్పెను. రాజహంసి పద్మాకరమును గోరుసుగాని యన్యమును గోరదుగదా. చెలులకుఁ దన మనసెఱింగించిన పక్షమున వారు తన్ను గేలిసేయుదురను భయముచేతఁ దన మనోభీష్టమును వారికి వెలిఁబుచ్చకుండెను. ఎప్పుడును దనలోఁదానె చింతసేయు చుండును.

చింతాజ్వరముచేత నామెకు సర్వము వెగటుగ దోఁచెను. పూర్వమువలెఁ జెలులసాంగత్యము కోరదు. ఒంటిపాటున నుండుట కభిలషించును. పరమణీయ వస్తువులను నొల్లదు. ఆమెయందలి యీమార్పులను సఖులతిత్వరలో గ్రహించి, వానికిఁ గారణములను గూడ

నారసి తెలిసికొనిరి.

రుక్మిణిసంగతి కర్ణాకర్ణిగా నామె తల్లిదండ్రుల చెవులఁబడెను. భీష్మకమహారాజు బహుదినంబులుగఁ దన కూఁతును దగిన వరునకిచ్చి వివాహము చేయవలె నని యాలోచన చేయుచుండెను గాని, యా విషయమై యెట్టి ప్రయత్నము లేమియుఁ జేయకుండెను. ఇప్పు డాతఁడు తన భార్యతో నాలోచించి మంత్రుల పురోహితుల యాప్తుల బంధువుల యార్యుల యభిప్రాయముం గైకొని వరనిశ్చయము చేయుట యుచితమని యెంచి, మఱునాఁడు సభ సమావేశమగునట్లు తన ప్రధానమంత్రి కాజ్ఞయిచ్చెను.

## II

ఆస్థానమండపమున సభ సమావేశ మాయెను. రాజు సింహాసనము నింకను నలంకరించి యుండలేదు. సింహాసనమునకుఁ గుడిప్రక్క రాజుయొక్క బంధువులు నాప్తులుఁ గూర్చుండి యుండిరి. ఎడమప్రక్క సామంతులును మంత్రులును నాసీనులయి యుండిరి. ఎదుటం బురోహితులును, జ్యోతిష్కులును, కవిపండితులును నుచితాసనములఁ గైసేసియుండిరి. వీరికిఁ గొంచెముదూరముగాఁ జుట్టును నంతస్తులుగా రచించియుండు నాసన

ముల మీఁద నార్యజనులు నిండియుండిరి. ఒండొంటి కెదురుగానుండు మరకత ద్వారములపంక్తినుండి జనులు వచ్చుట నిలిచెను.

అంతఁ దూర్యధ్వనులు మొరసెను. సభాభవనము నిశ్శబ్దమయ్యెను. రాజును యువరాజును ప్రవేశించిరి. సదస్యులు గౌరవసూచకముగా నిలువఁబడిరి. రాజు సింహాసనముపై గూర్చుండెను. యువరాజు సింహాసనమునకుఁ గొంచెము దూరముననున్న యాసనముపై గూర్చుండెను. వీ రాసీనులయిన తోడనే సభికులును గూర్చుండిరి.

పిమ్మట రాజులేచి "రాజపుంగవులారా! మంత్రిసత్తములారా! ఆర్యులారా! ఈ సభ సమావేశమయిన కారణము మీలో ననేకులకుఁ దెలిసియే యుండును. నాకూర్మిపుత్రికయగు రుక్మిణి వివాహసమయోచితయయి నిలిచియున్నది. కన్య యెప్పుడు బరుల సొమ్మగదా. కావునఁ గులమును, రూపమును, విద్యాబుద్ధులును, ఐశ్వర్యమును గల వరునకుఁ గన్యాదానముచేసి కృతార్థుఁడనైనచో నా మనస్సు నిర్మలమగును. ఓ శేముషీసింధువులారా! రుక్మిణికిఁదగిన రాజకుమారుని మదినారసి, ఆవిధమును మాకుఁ దెలియఁ జేయఁ గోరుచున్నాము. ఈ పెండ్లివిషయమున మన

కును నితర రాజన్యులకును గల స్నేహవైరములనుగూడ విచారింపవలసియున్నది" అని వచించి కూర్చుండెను.

సభికు లొకరితో నొకరు గుసగుసలాడ నారంభించిరి. అంత మంత్రులలో నొక్కఁడులేచి "రాజచంద్రమా! రుక్మిణీమణికిఁ దగినవరుఁడు వసుదేవుని కుమారుఁడగు కృష్ణుఁడుతప్ప మఱెవ్వరును లేనట్లు నాకుఁ బొడగట్టుచున్నది. తమరు సెలవిచ్చినరీతిగా వరున కుండవలసిన గుణములన్నియు నీతనియం దమరి యున్నవి" అని నుడివి కరతాళధ్వనులు మ్రోఁగఁగా కూర్చుండెను.

ఈ పలుకులు యువరాజగు రుక్మికి ములుకులవలె నాఁటెను. కరతాళధ్వను లాతనికోపాగ్ని కింధనములయ్యెను. హృదయమున రగులుచున్న కోపాగ్నిజ్వాలలు పైకెగఁబ్రాకెనో యనఁగ నాతని కన్నులెఱ్ఱఁబాఱఁగా లేచి, సభికులందఱఁ బాఱఁజూచి, "సరి సరి! మంచి పెద్దలె! అభినవశిరీష పుష్పసుకుమారియు, సూరిజనాభినుత సద్గుణశీలయునగు రుక్మిణి నొక పసులకాపరి కొసఁగుమనియా మీరు రాజునకాలోచనము చెప్పుట! ఆహా! మీ సాహసమునకు నేనేమని చెప్పుదును! ఆ నవనీతచోరుఁడు రుక్మిణి చెట్టఁబట్టుట కెవ్విధమునను నర్హుఁడు గాఁడు. వాని కులశీలములు మా కేమాత్రము గిట్టవు. ఆగొల్లనికి రుక్మిణిం గట్టినఁ గాకిముక్కునకుఁ దొండ

పందు గట్టినట్లుండును.

"నాకొకటి పొడగట్టుచున్నది. రుక్మిణిని నీ పశుపాలున కిచ్చుటకంటెను జేదినాథుఁడగు శిశుపాలున కిచ్చుట మిక్కిల శ్రేయస్కరంబని. ఇందుమీఁద బెద్దల మనస్సునకు వచ్చినరీతిని జేయవచ్చును. అయిన 'నాత్మ బుద్ధి స్సుఖంచైవ'యనెడి సామెత మఱవఁదగినదిగాదు." అని వచించి యాసీనుఁ డాయెను.

ఇతని యనంతరము సదస్యులలో నెవ్వరును దమ తమ యభిప్రాయములను వెలిబుచ్చ సాహసింపరైరి. కాని మొక్కమూలనున్న యెవ్వఁడో లేచి "రుక్మిణీకన్యకామణికి శిశుపాలుఁ డేమాత్రము తగినవరుఁడు గాఁడు. ద్వారకాధ నాథుఁడగు శ్రీకృష్ణభగవానుఁడే యామెకు దగినభర్త. ధర్మమని యెఱిఁగియుఁ దాను లాభముచేతనో, లోభముచేతనో, మొగమోటముచేతనో, యాధర్మమును దెలియఁజేయకుండిన నాతఁడబద్ధము లాడిన పాపమునఁ బోవునని పెద్దలు నుడువుదురు. కావుననాకు ధర్మమని తోఁచిన దానిని జెప్పితిని; నన్నుక్షమింతురుగాక." అనియెను.

రుక్మి దుష్టుఁడు గావున రాజు నాతని యభీష్టమునకు వ్యతిరేకముగాఁ బోవుట యుపద్రవకరమని యెంచి సభికుల నుద్దేశించి యిట్లనెను.

"ఇప్పుడు మీరు సూచించినట్లు కృష్ణ శిశుపాలు రిరువురు వరులున్నారు. వీరిలో రుక్మిణీ హస్తగ్రహణము నకుఁ దగినవారెవ్వరో నిర్ణయింపవలసియున్నది. నాకుఁ జూడఁ జూడ శిశుపాలుఁడే యందులకుఁ దగినవాఁడని తోఁచుచున్నది."

సభ ముగిసెను. వచ్చిన వారందఱుఁ దమతమ గృహంబులకుఁ బోయిరి. రాజన్యులు రథంబు లెక్కి పోయిరి. కొందఱశ్వములమీఁద వెడలిరి, మఱికొందఱు పాదచారులై చనిరి.

## III

రుక్మిణికిఁ దనచెలికత్తెలలోనెల్ల, రాజపురోహితుని కడగొట్టుకూఁతురగు చారునాసపై ననురాగమెక్కువ. కావుననే యితర సఖులకుఁ దెలియని రుక్మిణీ మనోభావము లీచారునాసకుఁ దెలిసియుండును. చారునాస సభలోజరిగిన సంగతులను దన యన్నవలన విని సాయంకాలమున రుక్మిణి కీసంగతులను దెలుపుటకయి నగరునకు వెళ్ళి, మేడమీఁదికెక్కి చెలి గదియొద్దకుఁ బోయెను. గదితలుపు మూసియుండినది. తలుపుదగ్గఱనే కొంతసేపు నిలువఁబడెను. లోపలనుండి 'హా కృష్ణా! దేవకీనందనా! భువనైక మోహనా!' యని నిట్టూర్పుతోఁ

కూడిన దీనస్వరము వినఁబడెను. విన్న కొంత సేపటికిఁ దిన్నఁగఁ దలుపుతట్టెను. చెక్కిలిక్రిందఁ జెయ్యూని తల్పమునఁ బరుండియున్న రుక్మిణి దిగ్గునలేచి, కొంగుతోఁ గన్నులు దుడుచుకొని, వచ్చి తలుపుఁ దెఱచెను. చారునాస గదిలోనికిఁబ్రవేశించుచు, రుక్మిణి సభలోజరిగిన సంగతులు విచారించితివాయని చెలినడిగెను. చారునాస “చెలియా! నేనేమని చెప్పుదును; మీయన్న యందఱు నదల్చి కృష్ణుఁడు నీకుఁ దగినవరుఁడు కాఁడనియు శిశుపాలునకే నిన్నీయవలయుననియుఁ జెప్పెనఁట. మీతండ్రిగారును శిశుపాలునకేనిన్నిచ్చునట్లుగా నిశ్చయించిరఁట. ఇంతేకాక నేఁటికి మూఁడవనాఁడు ముహూర్తమని లగ్ననిశ్చయమునుగూడఁ జేసి శిశుపాలాదులకు శుభలేఖలను బంపినారఁట. ఈసమాచారమంతయు మాయన్నవలన వింటిని,” అని చెప్పఁగా, రుక్మిణి మనసు మిక్కిలి కలంగెను. అయినను నామె ధైర్యమును జిక్కఁబట్టి యాలోచనముచేసి, “నెచ్చెలీ! చారునాసా! నాకొక యుపాయము తోఁచుచున్నది. కృష్ణభగవానుఁడు నాయందు బద్ధానురాగుఁడై యున్నాఁడని వినియున్నదానను. ఇక్కడ జరుగనున్న సంగతి నాతనికిఁ దెలియఁజేసిన నాతఁడు తప్పక యేదేని ప్రతిక్రియచేయును. మీయన్న ద్వారకకు నానిమిత్తము పోవసమ్మతించునా? నీ వాతని

నిక్కడకుఁ దోడితెచ్చిన, నేనెట్లయినను వేఁడికొందును. సఖీ! ఈ యుపకారమును జేసి పుణ్యము గట్టుకొమ్మ." అని చెప్పెను. అందుసకుఁ జారునాస "నీవింత వేఁడుకో ఏలెనా? నేనాతని కంతయుఁజెప్పి ద్వారకానగరము నకుఁబోవ సమ్మతింపఁ జేసెదను. రేపుదయమునఁ బూల తోఁటలో నుండుము. నేనాతనిఁ దోడ్కొని యక్కడకు వచ్చెదను." అని ధైర్యముచెప్పి యింటికిఁ బోయెను.

అంత రుక్మిణిని భోజనమునకు రమ్మని తల్లి పిలి చెను. రుక్మిణి మేడదిగివచ్చి, యెంగిలిచేసి మరలఁ దన గదికిఁ బోయెను. దీపము వెలిఁగించి యేమో చదువఁ జూచెను. కాని, యది రుచింపదయ్యెను. పిమ్మట దీప మార్పి పాన్పుపైఁ బన్నుండెనుగాని నిదురపట్టలేదు. కన్నులు మూసియుండినను కృష్ణుని మనఃకల్పిత రూప మామె కనులకుఁ గట్టినట్లుండును. శిశుపాలుని రూపము తలఁపునఁ బాఱినపుడు మనస్సు డీలుపడఁగాఁ గన్నులు తెఱచును. మఱి నిట్టూర్పు విడుచును.

ఇట్లులై రాత్రిగడచెను. అరుణోదయంబయ్యెను. రుక్మిణి మేడదిగి పూలతోఁటకుఁ బోయి పుష్పములు గోయుచు బ్రాహ్మణచారునాసల రాకకయి యెదురు చూచుచుండెను.

అంత వారును వచ్చిరి. రుక్మిణి బ్రాహ్మణునకు

నమస్కరించి "ఓభూసురాగ్రణీ! నే జెప్పవలసిన దంతయు మీచెలియలే మీకుఁ జెప్పియుండును. దేవకీనందనుఁడగు కృష్ణునిమీఁదనే నామది నిలిచియున్నది. ఆ మహానుభావునకు వృత్తాంతమంతయు విన్నవించి నన్నాతనికి భార్యగాఁ గూర్పుము." అని సంకోచించి పలికెను. అందుల కాబ్రాహ్మణుఁడు, "అమ్మాయీ! నేను కృష్ణునకంతయు విన్నవించి యాతని నిక్కడకుఁ దోడి తెచ్చెదను. ద్వారక కిప్పుడే ప్రయాణము చేసెదను!" అని పలికి వెడలెను.

రుక్మిణి తనచెలికత్తెను, చేసినమేలునకై, మిక్కిలి కొనియాడెను. కోసినపూలొడిలోనే యుండగా, వారొండొరుల కంఠములపయిఁ జేతులు వైచికొని తేలికయగు హృదయంబులతోడ గృహంబునకు నడచిరి.

## IV

బ్రాహ్మణుఁడు ద్వారకానగరంబుచేరెను. అందలి యున్నతగోపురప్రాసాదహర్మ్యములను గాంచుచు వాని యందమునకుఁ గడునుబ్బుచు రాచనగరునకు వచ్చెను. ఒక ద్వారపాలకునిఁ దనరాకను కృష్ణున కెఱింగించుటకయి పంపఁగా వాఁడు లోనికిఁ జని మరలవచ్చి యాబ్రాహ్మణుని రమ్మని లోనికిఁ గొనిపోయెను.

బ్రాహ్మణుఁడు ద్వారపాలకుని వెంబడి ద్వారములఁ గడ
చుచుఁ బాలరాతి మెట్లెక్కుచుఁ, దనరూపము ప్రతిబిం
బించుచున్న స్ఫటికశిలా నిర్మితములయిన గోడలను గాం
చుచు, గుండ్రని పగడంపుఁ గంబములను దిలకించుచు,
నాశ్చర్యమగ్న మానసుఁడయి, మెల్లమెల్లఁగా నడుగు
లిడుచు, బంగారు గద్దియపయిఁ గూర్చున్న యదుకుల
సార్వభౌమునిఁ జూచి కేలుమొగిచి మ్రొక్కెను. కృష్ణుఁడు
తన యాసనమును విడిచి, లేచి వచ్చి, బ్రాహ్మణునకు
మాఱు మ్రొక్కి, యుచితాసనమునఁ గూర్చుండఁబెట్టి,
యెల్లర కుశలంబడిగి, త్వరగా షడ్రసోపేతమయిన భోజ
నము పెట్టించి, తాంబూలమిచ్చి సంభావించి, యాతని
రాకకుఁ గారణంబడుగఁగా నాతఁడు రుక్మిణి కృష్ణునియందె
బద్ధానురాగయై యుండుటయు, అమె మనోభీష్టమునకు
వ్యతిరేకముగా భీష్మకరాజామెను చైద్యుఁడగు శిశుపా
లున కిచ్చునట్లు నిశ్చయించుటయు మొదలగు నెల్లసంగ
తులను దెలిపి, "యాకన్య తేపే మీరాకకై యెదురు
చూచుచుండును" అనెను. కృష్ణుఁడు కొంచె మాలో
చించి "విప్రోత్తమా! ఆకన్య గుణరూపలావణ్యముల
వినియున్నాను. ఆకన్యమీఁదనె నాచిత్తమును నిలిచి
యున్నది. ఆభువనమోహన విగ్రహను రాక్షస వివాహ
మునఁగాక పెండ్లియాడక తీరదు. రాణివాసములోనుండు

నామెను దేవలయునన్న సకలబాంధవులను గడతేర్చ వలసి వచ్చుఁగదా యని మదిని జంకుచున్నాఁడను" అని చెప్పెను. అప్పుడు బ్రాహ్మణుఁడు, "దీనికొక యుపాయమున్నది. పెండ్లికిముందు గౌర్యాలయమునకుఁబూజార్థమై రుక్మిణి గొనిపోఁబడును. అందుండి యింటికి మరలు నప్పుడామెను నీవెత్తుకొని పోవచ్చును. ఒకవేళ యుద్ధముజరిగిన నందలి ఫలము వారనుభవించెదరు. దీనజనమందార! జాగుచేసినఁ బ్రయోజనములేదు. తేపుదయమున నే కుండినగరంబున మన ముండి తీరవలయును." అని నుడువఁగా నందులకుఁ గృష్ణుఁడు "నేటి రాత్రియె పయనమగుదము. అట్లయిన తేపుదయంబునకుఁ గుండిన నగరములో నుండఁగలము. మీరుకొంచెము విశ్రమింపుఁడు." అని పలికి బ్రాహ్మణుని వేఱొకగదిలో విశ్రమింపఁజేసి, దారకుఁడను సారథిని రావించి యతనికిఁ గుండిననగర ప్రయాణమును దెలిపెను. అంత దారకుఁడు రథమును సిద్ధపఱచి, గరుడకేతన మెత్తి, యాయుధముల నందుంచి గుఱ్ఱములఁగట్టి నియమిత కాలమునకు సరిగా రథమును గుమ్మము దగ్గర నిలిపెను. కృష్ణుఁడును బ్రాహ్మణుఁడును రథమెక్కి కూర్చుండిరి. రథము కదలెను.

కృష్ణుఁ డొంటిగఁ బోవుటవిని, కుండిననగరంబునఁ

గన్యకనిమిత్తము యుద్ధము జరుగునని యూహించి, యాతనియన్నయగు బలరాముఁడు బంధురాజులఁదోడ్కొని సైన్యసమేతుఁడయి కృష్ణుఁడు పోయిన జాడనే పోయి దారిలో నాతనిఁ గలసికొనెను.

## V

రుక్మిణీ వివాహమునకై కుండిననగర మలంకృతమయి యుండెను. గొప్ప పెండ్లి పందిరులు వేయఁబడినవి. గోపురములు చిత్రవస్త్రాలంకృతములై యుండెను. ప్రతిద్వార మరఁటి కంబములతోడను, రత్నతోరణములతోడను, విచిత్ర సుమదామములతోడను, పలురంగుల పతాకల తోడను, సుందరతరంబుగ నలంకరింపఁబడిఁ యుండెను. రాజమార్గములు, సందుగొందులు, శుభ్ర నుం చేయఁబడి పన్నీటి కలయంపి చల్లఁబడియుండెను. "ద" అని మధ్యమున నక్కడక్కడ రమణీయములైన తోర గట్టఁబడి యుండెను. ఎల్లగృహంబులు చక్కఁలురుక్మిణిని యాలంకరింపఁబడి యుండెనవి. స్త్రీలు తమ గృహములో ప్రాంగణంబుల నలికి, ముగ్గులిడి, యగరు నిడి, చిత్రాంబరములను దివ్యాభరణమ్ముట విని, భీష్మ మిక్కిలి సంభ్రమముతో నుండిరి. వివిధవారలకుఁ జక్కఁగా మొరయుచుండెను. వించి, తూర్యధ్వను

రాజు లనేకులు వచ్చియుండిరి. శిశుపాలుఁడు చతురంగబలసమేతుఁడయి జరాసంధదంతవక్త్రవిదూర సాల్వాది బంధు మిత్త్రులతో మిక్కిలి సంరంభమున నేతెంచెను. భీష్మకుఁడు సముచిత పరివారముతో శిశుపాలు నెదుర్కొని సంభావించి, యొక సౌధమునందు విడియించెను.

కృష్ణ బలరాములు కుండిననగర ప్రాంతమున నున్న యొక తోఁటలో దిగిరి. కృష్ణుఁడు రుక్మిణికిఁ దెలియఁజేయుమని కొన్ని రహస్యవచనంబులు చెప్పి, బ్రాహ్మణుని బుచ్చెను.

రుక్మిణి మంగళస్నానము చేసి, వస్త్రయుగళము ధరించి, పురోహితుఁడు గ్రహశాంతి కొఱకు హోమము చేయింపఁగాఁ జేసి, చెలుల మొఱంగి, గృహారామము నకుఁ జని పువ్వులఁ గోయుచు,

మ. "ఘనుఁడా భూసురుఁ డేగెనో నడుమ మా
ర్గశ్రాంతుఁడై చిక్కెనో
విని కృష్ణుండిది తప్పుగాఁ దలఁచెనో
విచ్చేసెనో యీశ్వరుం
డనుకూలింపఁ దలంచునో దలఁపడో
యార్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో నెఱుఁగదో
నా భాగ్య మెట్లున్నదో."

అని వితర్కించుచు నుండెను. అంత బ్రాహ్మణుఁడు వచ్చెను. రుక్మిణి యాతని ముఖలక్షణము వీక్షించి మొగమునఁ జిఱునగ వంకురింప నెదురుపోయి నిలువఁబడఁగా నాబ్రాహ్మణుఁడు, "కృష్ణుఁడు వచ్చియున్నవాఁడు, సురాసురు లడ్డువచ్చినను రాక్షస వివాహమున నిన్నెత్తుకొని పోవునఁట. రుక్మిణీ! నీమనోరథ మీడేరినదమ్మా," యని చెప్పెను. దానికి రుక్మిణి "అంతయు మీ యనుగ్రహముననె మహాత్మా! మీఋణ మేనాఁటికిని దీర్చికొననేరను. ఇదె మీకొక నమస్కారము" అని యాతని పాదములకు మ్రొక్కెను. పిదప బ్రాహ్మణుఁడు "అమ్మాయీ! గౌర్యాలయమునుండి వచ్చునప్పుడు కృష్ణుఁడు నిన్నెత్తుకొనిపోయి తనరథములోఁ గూర్చుండఁ బెట్టుకొని పోవును. నీవప్పు డేమరక జాగ్రత్తతో నుండుము. నేనుబోయి గాకీయాత్రకు సిద్ధము చేసెద" అని చెప్పి వెళ్ళెను.

బ్రాహ్మణుఁడు పోయినతోడనే చెలులురుక్మిణిని వెదకికొనుచు వచ్చి యామెను దోడ్కొని గృహములోనికిఁ జనిరి.

కృష్ణ బలరాములు పెండ్లికి వచ్చుట విని, భీష్మకుఁడు, బంధుజనసేనాసమేతులయిన వారలకుఁ జక్కఁగా నమర్పఁబడిన గృహంబులు విడిది గావించి, తూర్యధ్వను

లతో వారినెదుర్కొని, సత్కరించి, తోడితెచ్చెను.

కృష్ణుని రాకను విన్నజనంబు లా భువనైక మోహనవిగ్రహుని జూడవలెనని యెల్లచోట్లఁ గ్రిక్కిరిసి యుండిరి. పురుషులు వీధులలో నిండియుండిరి. స్త్రీలు మేడలమీఁదను వాతాయనములలోను నిండి కలకలము చేయుచుండిరి. ఉత్సవశ్రేణిరాఁగా నందఱు కృష్ణుని జూచి యీతఁడె రుక్మిణికిఁ దగినవరుఁడని యనుకొనిరి. స్త్రీలు తమ చేతులయందలి కంకణములు మ్రోఁగఁగా గృష్ణునిమీఁద సేసలు చల్లిరి.

## VI

పురోహితులు వివాహముహూర్తము సమీపించుచున్నదనియు, గౌర్యాలయమునకు శీఘ్రముగఁ బోయి రావలయు ననియుఁ దీవరింప సాగిరి. అందఱు సిద్ధపడిరి. భీష్మకరాజు, హిత బంధు సామంత మంత్రులతో నగరు వెలుపలనుండెను. వివాహమునకు వచ్చిన యనేక రాజులును దమతమ పరివారములతో నందె యుండిరి. పుష్పములును, ఫలములును, ఉపహారములును, కానుకలును, పూజాది వివిధ సామగ్రియు నిడిన పసిండి పళ్ళెరంబులను బ్రాహ్మణ స్త్రీ లెత్తుకొని వెలికి నడచిరి. తల్లియు, సఖులును, బంధుస్త్రీలును వెంటరాఁగా రుక్మిణి బయలు

వెడలెను. తూర్యాదిధ్వనులు దిక్కులు పిక్కటిల్ల మ్రోఁగెను. శస్త్రాస్త్ర సమేతులయి వీరభటు లుత్సవశ్రేణి చుట్టును గొలుచు చుండిరి. ఉత్సవశ్రేణి గౌర్యాలయమునకుఁ గదలెను,

ఇట్లు రుక్మిణినడిచి గౌర్యాలయమును జేరి, శంకరునితోఁ గూడియున్న గౌరిసమీపమునకుఁబోయి గంధపుష్పాక్షతాదులచేతఁ బూజఁ గావించి, నిశ్చలమైన భక్తితో మనస్సున నిట్లు ప్రార్థించెను:—

"అంబా! భగవతీ! గౌరీ! నిన్నే నమ్మియున్నదానను. దేవకీనందనుఁడగు కృష్ణునే నాకుభర్తఁగానిమ్మీ."

అటుతరువాత రుక్మిణి బ్రాహ్మణపుణ్యస్త్రీలకు వాయనదానంబు లిచ్చి మ్రొక్కఁగా వారు దీవించి యామె శిరస్సున నక్షతలు పెట్టిరి. అంత రుక్మిణి గౌరీదేవికి నమస్కరించి గుడివెడలెను.

ఇట్లు వెడలి కృష్ణుని రాకకై యెదురు చూచుచు నుత్సవశ్రేణి మధ్యమున నడుచుచున్న హంసగమనయగు రుక్మిణియొక్క రూప యౌవన లావణ్యాదులను రెప్ప వేయక వీక్షించెడు రాజకుమారులు తమశస్త్రాస్త్రంబుల దిగనాడి చోద్యపడుచుండిరి. రుక్మిణి పైఁటను సవరించుకొనుచు వరుసగా రాజకుమారుల నందఱనుఁ గడకంటి చూపులచేతఁ జూచుచుండెను. అప్పుడు మేఘవర్ణనిభాం

గుఁడును, విశాల వక్షుఁడును నగు కృష్ణుఁడు రథంబు మీఁదఁ గూర్చుండి తన్ను సమీపించుటను జూచెను. కృష్ణుఁడు క్రిందికి దుమికి రుక్మిణి నెత్తుకొనిపోయి రథంబు మీఁదఁ దనప్రక్కనఁ గూర్చుండఁబెట్టుకొని, శంఖంబు పూరించి, శత్రురాజులందఱుఁజూచుచుండఁగా, ద్వారకా నగర మార్గము పట్టెను. బలరాముఁడును సైన్యము తోడఁ గృష్ణునివెంటనే చనెను.

అంత శిశుపాలుఁడు, జరాసంధుఁడు, సాల్వుఁడు, విదూరుఁడు మొదలగు వారందఱును సైన్యావృతులయి యాదవుల వెన్నంటిరి. యాదవవాహినీ పరివృతులగు కృష్ణ బలరాములు వారల నోడించిరి.

ఆవెనుక రుక్మి సైన్యముంగూర్చుకొని కృష్ణుని వెన్నంటిపోయి తాఁకెను. కృష్ణుఁడాతనిగూడ నోడించి యవమానపఱచి పంపెను.

ఇట్లు కృష్ణుఁడు శత్రురాజుల నోడించి, రుక్మిణీ సమేతముగ ద్వారకా నగరంబు ప్రవేశించి, యొక శుభ ముహూర్తమున రుక్మిణిని మహావైభవముతోఁ బెండ్లాడెను.

# ద్రౌపదీ వివాహము

భూరమణీలలామ లలాటమునంగలి తిలకంబు భాతి దక్షిణ పాంచాలదేశమునకు రాజధాని యయిన కాంపిల్యపురం బలరారుచుండెను. దానిని ద్రుపదుండను రాజు పరిపాలించుచుండెను. ఆరాజుభార్య కోకిలాదేవి. ఆదంపతులకు సంతానము లేమిం జేసి, వారు విప్రోత్తములను సన్న్యాసులను, నిష్టదేవతలను నుపాసించుచుండిరి. ఒక్కనాడు ద్రుపదుఁడు గంగానదియొడ్డున యాజుఁడు, ఉపయాజుఁడు నను మునిపుంగవులను గాంచి ప్రణతు లొనర్చి "మునినాథులార! నేననపత్యుఁడను. సంతానము లేనిబ్రతుకు నిరర్థకము గావున, సత్సంతాన ముదయించు నట్టి క్రతువొకటిచేయించి, నన్ను గృతార్థుం జేయుఁడు." అని వేఁడుకొనఁగా వారు ద్రుపదునకుఁ బుత్రికా మేష్టి చేసిన సత్సంతానము గలుగుననియు, ఆక్రతువును దమలో నొకరు యాజకత్వము వహించి చేయించెదమని యుఁ బలికిరి. అంత నొక సుముహూర్తంబున యాజుండు యాజ్ఞికుఁడుగాఁ, గోకిలాదేవి పత్నిగా ద్రుపదరాజు యజ్ఞంబుచేయ నుపక్రమించెను. అగ్నికుండమునందు

మంత్రాహుతులు వేల్చుచుండఁగా నందునుండి తేజోరాశి యగు పుత్రుఁడును లావణ్యరాశియగు పుత్రికయు నుద్భవిల్లిరి. పుత్రునకు ధృష్టద్యుమ్నుఁడనియుఁ, బుత్రికకుఁ గృష్ణయనియు నామకరణంబులుచేసిరి. కృష్ణకు ద్రౌపది యను నామాంతరమును గలదు. ద్రౌపదియనఁగా ద్రుపదరాజపుత్రియని యర్థము.

ఇట్లు ద్రుపదరాజు సంప్రాప్త సంతానుండయి, సంతసిల్లి, యాజోపయాజులకు భూరిదక్షిణలిచ్చి తుష్టులంజేసియనిపెను. ధృష్టద్యుమ్నుండును ద్రౌపదియు దినదిన ప్రవర్ధమానులగుచుండిరి. ధృష్టద్యుమ్నుఁడు ధనుర్వేద పారంగుఁడాయెను. ద్రౌపది వివాహయోగ్య యయ్యెను.

## II

ద్రౌపదిని నర్జున కిచ్చి పెండ్లి చేయవలెనని, ద్రుపదరాజునకుఁ జిరసంవర్ధితమగు కోరికగలదు; లక్కయింటఁ బాండవులు కాలిపోయి రన్నవార్త, విప్రుల వలనవిని, యమ్మహీపతి మిక్కిలి శోకించెను. కాని, యాతని పురోహితుఁడు జ్యోతిషమునుజూచి పాండవుల కెట్టి యుపద్రవము గలుగలేదనియు, వారు సుఖంబున్నారనియు, ద్రౌపదీ స్వయంవరంబు చాటించిన వారలెందుండినను నక్కడకు వత్తురనియుఁ బలుకగా, నదివిని

రాజును శాంతచిత్తుండయి, నాఁటికి డెబ్బదియైదవ దినం
బున ద్రౌపదీ స్వయంవరమని ఘోషింపఁబంచి, నానా
దేశముల రాజులకు స్వయంవరాహ్వాన పత్రికల నంపెను.
అర్జునుని బాహుబల విక్రమంబులు స్వయముగ నెఱింగిన
వాఁడగుటచేత, ద్రుపదుం డర్జునునకుఁదప్ప మఱెవరికిని
మోపెట్ట శక్యముగాని యొక ధనుస్సును, అంతరిక్షమున
దూరమున గిరగిరందిరుగు మత్స్యయంత్రమునురచించెను.

లక్కయిల్లు గాలువేళ నొరుల కెఱుంగరాక
తొలువఁబడిన సొరంగము మార్గమున వెలువడిన జననీ
సహితులగు పాండుపుత్రులేకచక్రపురంబుచేరి, బ్రాహ్మణ
వేషంబున భిక్షాన్నము దినుచు వేదాధ్యయనంబు సలు
పుచు నొక బ్రాహ్మణునింట సుఖముగా నుండిరి. ఇట్లుం
డఁగాఁ గొన్ని దినంబులకుఁ గాంపిల్యపురమునుండి విప్ర
వరుం డొకండు వచ్చి పాండవులున్న గృహంబుననే
దిగెను. ఆగృహమేధి యభ్యాగతుని సత్కరించి, భోజ
నంబుపెట్టి సంతుష్టుం జేసెను. పిదపఁ గుంతీదేవి తానును
గొడుకులు నవ్విప్రవరుని సమీపించి, “అయ్యా! యెం
దుండి మీరాక? ఏ దేశములు సంపత్సమృద్ధములు?” ఏ
దేశముల రాజులు ధార్మికులు? సద్గుణసంపన్నులు?”అని
యడుగఁగా నాతఁ డిట్లుపలికెను. “నేను పెక్కుదేశ
ములం గాంచి యాయారాజుల చరితలఁ గంటిని; గాని

ద్రుపదరాజు దేశమున కెనయగు దేశ మేదియు లేదు. ద్రుపదరాజు మహాధర్మాత్ముఁడు, గుణగరిష్ఠుఁడు; అమ్మహీపతికి గుణరూప విలాససంపదల నొప్పు నొక్క కూఁతురు గలదు. ఆకన్యారత్నంబును నిష్ఠుండయిన రాకొమారునకిచ్చి పెండ్లి సేయంగానక, ద్రుపదరాజు స్వయంవరంబు రచించుచున్నవాఁడు. అనేక రాజపుత్రులు స్వయంవరమునకుఁ బోవ నున్నారు. రాఁగల పుష్య పంచమినాఁడె స్వయంవరము." అన విని పాండవు లందులకుఁ బోవనిశ్చయించి, తల్లికిఁ దెలుపఁగా నామె "పరుల యింటిపంచన నెన్నేనిదినంబు లుండఁదగదు. ద్రుపద పురంబగు కాంపిల్యమునకుఁ బోవుటయే లెస్స." అని నుడివెను. అంతటను దామున్న యింటిబ్రాహ్మణునకుఁ బోయివచ్చెదమని చెప్పి వీడ్కొని చనిరి.

## III

వారు పెక్కు తటాకములం గడచిరి; ఉగ్రనగంబుల నుత్తరించిరి; అనేక వాహినులఁ దరించిరి; దుస్తర కాననంబుల దాఁటిరి. ఇట్లునిరంతర ప్రయాణములఁ బోవు పాండవులు దమ పుణ్యవశమున మార్గమున వ్యాస మహర్షిం గాంచిరి. కని యమ్మునీశ్వరునకు సాష్టాంగ దండ ప్రణామంబు లాచరించిన, నా దయామయుఁడు

"మీరు ద్రుపదుపురంబునకుఁ జక్కఁజనుండు. అక్కడ మీకు శుభంబగు"నని చెప్పిపోయెను. పాండవులు జననీ సమేతముగా రాత్రియనక పగలనక ప్రయాణము చేయువారొక్కనాఁడు మంచి నడురేయి గంగతో సోమశ్రీవమను పుణ్యతీర్థంబునఁ దీర్థంబాడఁగఁ గుతూహలపడి యక్కడకుఁ బోవుచుండిరి. అర్జునుం డొక్క కొఱవిఁ జేతఁబట్టుకొని ముందు నడువఁగా నాతనివెంట వెలుతురులో నందఱును నడుచుచుండిరి. అంతఁ బ్రొద్దు, కాంతా సహితంబుగా గంగకు జలక్రీడార్థము వచ్చిన యంగారపర్ణుఁడను గంధర్వుఁడు పాండవుల కాలిచప్పుడు విని రోషావేశుఁడయి కేల విలుపూని గుణధ్వని చేయుచు నిట్లనియె. "నడురేయియు నుభయసంధ్యలును, భూతములు, యక్షులు, రాక్షసులు గంధర్వులు సంచరించు సమయములని యెఱుఁగక యిట్లువచ్చు మానవులరు మీరెవరు? నేనంగారపర్ణుఁడను గంధర్వుఁడను. ఎప్పుడు నిందు విహరించు నన్నెఱుంగరా? చోరరాని మదీయంబగు నీవనమెట్లు చొరఁగలిగితిరి? ముందరకుఁ గాలిడక వచ్చిన దారిం బొండు. లేదేని మీప్రాణంబుల హరియించువాఁడ." అన విని యర్జునుండు "అర్థరాత్రమందును సంధ్యలందును దుర్బలులగువారు నడువనోపరు. గాని బల్లిదులమగు మేమట్లు చేయనొల్లము. మేమెల్ల

యెడల నెల్లవేళలనిట్లె నడచెదము. ఈ వనభూములు నదులు నెల్లవారికి సేవ్యములగుఁ గాక యొకరి సొత్తు లెట్లగు? గంగా స్నానంబు గావింపవచ్చిన మేము మరలు వారముగాము. నీ వెఱపించు మాటలకు మేము భయపడెదమని తలఁచి యుంటివా?" యని తిరస్కరించి పలికి గంగం దీర్ఘమాడ సందఱతోడ నరుగుచుండెను. అంగారపర్ణుం డది సైఁపక కన్ను లెఱ్ఱచేసి బాణంబు లేయఁగా నర్జునుఁడు చేతనున్న కొఱవిద్రిప్పి బాణములు తన్నుఁ దాఁకకుండ రక్షించుకొని యాతనితో "ఓరీ మూర్ఖుఁడా! నీ బాణంబు లేమాయెను. ఇదిగో రక్షించుకొనుము." అని యాగ్నేయాస్త్రముం బ్రయోగించెను. తత్క్షణము గంధర్వుని రథంబు దగ్ధమాయెను. అగ్నిదాహభీతిచే నంగారపర్ణుండు బమ్మెరవోయి నేలఁబడెను. ఇట్లు పడినవాని నర్జనుండు ధర్మరాజుకడకు నెత్తుకొనివచ్చి ముదుంచెను. అంగారపర్ణుని భార్య కుంభీనస యేడ్చుచుఁ బాండవు లున్నచోటికి వచ్చి, పతిభిక్ష సేయుఁడని వారిని దీనవృత్తి వేఁడుకొనఁగా, ధర్మరాజు జాలిగొని యంగారపర్ణుని విడువుమని యర్జునునకుఁ జెప్పెను. అర్జునుఁడు వానిని విడువఁగా పరాజితుఁడయిన గంధర్వుఁ డర్జునున కిట్లు పలికెను. "ఇంతదనుక నన్నెవ్వరుఁ గెలిచి యుండలేదు. నీపరాక్రి

మంబునకు మదిమెచ్చితి. నీచేనోడింపఁ బడిన నే నంగార పర్ణనామ మింకను దాల్పసిగ్గగు చున్నది. గంధర్వ మాయించేసి యనేక రత్న విచిత్రింబయిన రథంబు వడసి చిత్రరథుండ నయ్యెదను. నీతోఁడఁ జెలిమిచేయ నాకు మనస్సు గలుగుచున్నది. దీర్ఘతపోలబ్ధం బగు చాక్షుసి యను విద్యనీకు నేర్పెదను. దాని ప్రభావమున ముల్లోకములంజూడఁ గలుగుదువు. నీవు నాకాగ్నే యాస్త్రం బొసంగునది.” అని యడిగెను. అదివిని యర్జునుండు దానెట్టి ప్రతిఫలం బపేక్షింపనని పలికి, యాగ్నేయాస్త్రమును గంధర్వునకు విధివంతముగా నొసంగెను. అతఁడు దానిని సంతోష పూర్వకముగాఁ బరిగ్రహించి, “మీరు పాండవులరని నేను మున్నె యుంగుదును. నేను మీకపరాధముచేసితి. నన్ను క్షమింపుఁడు. మీరు పురోహితుని బురస్కరించుకొనక యిట్లుండరాదు. ఇక్కడకు సమీపంబున నుత్కచంబను పుణ్యతీర్థ మొండుగలదు. అందు ధౌమ్యుఁడను తపో గరిష్ఠుఁ డగుబ్రాహ్మణశ్రేష్ఠుఁడు గలఁడు. ఆతనిని బురోహితుఁగాఁ బ్రార్థింపుఁడు. అమ్మహాత్మునిఁ బురోహితునిగాఁబడసిన మీకునిఖిలార్థ సంసిద్ధియగును.” అని పలికి సంతోష సంచలితాంతరంగుండయి, పాండవుల కేవురకుఁ జెరియొక నూఱువంతున రమణీయము

లగు గంధర్వ జవనాశ్వంబులనియ్య వారు "వీనిని నీకడనే యుండనిమ్ము. కావలసినప్పుడు కొనిపోయెద" మని చెప్పి గంధర్వుని వీడ్కొని, గంగం దీర్థంబులాడి, దానిని దాఁటి యుత్కచంబను పుణ్యతీర్థంబునకుఁ బోయిరి.

అందుఁ దపోనిష్ఠుఁడయి యున్న ధౌమ్యుఁగాంచి భక్తితో నమస్కరించి, పురోహితుఁగా వేఁడిరి. ధౌమ్యుఁడు వారినతిప్రీతితో సత్కరించి, పురోహితత్వమునకు నంగీకరించెను. వారును సర్వవిధముల బృహస్పతికీడగు ధౌమ్యుని బురోహితుఁగాబడసి సంతసిల్లి మరునాఁటి వేకువను దదాశ్రమంబు వీడ్కొని, దక్షిణ పాంచాల దేశమునకుఁ బ్రయాణం బయిరి.

## IV

పాండవులు పోవుమార్గమునఁ బెక్కండ్రు ప్రయాణికులు పోవుచుండిరి. వారిలోఁ గొందఱు రెండెద్దుల బండ్లమీఁద కుటుంబ సహితులయి పోవుచుండిరి. బండిమీఁదఁ బ్రయాణము చేయఁ గాసుపీసము లేని బ్రాహ్మణులు గొందఱు, పంచెచుట్టిన కృష్ణాజినంబులఁ జంకఁబెట్టుకొని, వస్తువుల మూటలను వీఁపునవైచికొని యాయాసపడుచు నడుచుచుండిరి. ప్రొద్దెక్కుచు

రాఁగ నెండ తీక్ష్ణమగుటచేఁ గొంద ఱక్కడక్కడఁ జెట్ల నీడల నించుకసేపు గూర్చుండి, మార్గాయాసమునించుక తీర్చికొని, మఱి దారి నడచుచుండిరి. మఱికొందఱు బ్రాహ్మణ ప్రయాణికులు దారిలో జలాశయమేదేనియుబ్బి నపుడు తామింటినుండి తెచ్చిన చలిదిమూటలను విప్పి యేమ్పుచుండు బిడ్డల కన్నముఁ బెట్టుటకయి, యట్టిచోట నాఁగుచుండిరి. బ్రాహ్మణ రూపధరులగు పాండవులు, ముందఱఁబోయెడు విప్రవరులంగని మీరెక్కడ కెందు నిమిత్తము పోయెదరని యడిగిన, వారు "ఱేపు పంచమి నాఁడు కాంపిల్య నగరమున ద్రౌపదీ స్వయంవరము వర్తిల్లెడు. అమ్మహోత్సవము దర్శింపఁ బోవుచున్నా రము. అక్కడకుఁ గార్ముక విద్యాప్రవీణులగు నానా దేశాధీశ్వరులు చనుదెంతురు. అందు బ్రాహ్మణులకు భూరిదక్షిణలు లభించును. మీరును నక్కడకేవచ్చువా రగుదురేని మాతోడరండు. ఒక్కటఁ బోవుదము." అని నుడువఁగాఁ బాండవు లట్లయగుఁగాక యని, యవ్విప్రులతో మాటలాడుచు మార్గాయాసము దోఁప కుండ దారినడచుచుండిరి. ఇట్లు నడచుచుఁ బోవఁ బోవఁ దారిలో నొక సత్రంబు గానఁబడెను. అప్పుడు సూర్యుఁడు నడిమింట నుండెను. ముందుగవచ్చి యందు దిగిన మార్గస్థులలోఁ గొందఱు వంటలు వండుచుండిరి;

మఱికొందఱు భోజనములు సలుపుచుండిరి; వేరుకొందఱు భోజనంబులు సలిపి విశ్రాంతి గైకొనుచుండిరి. మన బ్రాహ్మణులును పాండవులును నాసత్రంబున విడిసిరి. బ్రాహ్మణులు పాండవులను భోజనమునకుఁ బిలిచిరి గాని వారందుల కంగీకరింప కుండిరి. బ్రాహ్మణులు వంటచేయు నంతలో, భీముఁడు పరిసర వనంబులకుం జని, యందుదొరకిన కందమూల ఫలంబులలో సగపాలు దానుదిని, మరలివచ్చి మిగిలిన భాగమును దల్లికిని భ్రాతలకును భుజింపఁ బెట్టెను. అంత బ్రాహ్మణుల భోజనంబులును ముగిసెను. పాండవులును బ్రాహ్మణులును నిష్టకథాగోష్ఠిం గొంతప్రొద్దుపుచ్చి విశ్రమించిరి.

ఆనాఁటి ప్రయాణ మంతటిలో ముగిసెను. మఱునాఁడు పాండవులును బ్రాహ్మణులును ప్రభాతమందు లేచి కాల్యకృత్యములు దీర్చికొని పునఃప్రయాణమయి, సూర్యోదయమయిన రమారమి నాలుగు గడియలకుఁ గాంపిల్య నగరంబు చేరిరి.

కాంపిల్య నగరంబు నాలుగు దిక్కులఁ దెల్లని గుడారముల విడిసియున్న పెక్కురాజేంద్రుల నానావిధ స్కంధావారములు సముద్రంబువలె ఘూర్ణిల్లి మ్రోయుచుండెను. పురంబులోపలను జనసంకుల మధికముగా నుండెను. సకల గృహంబులు, గృహంబుల ముందరి

మరఁగులు, గుళ్ళు, సత్రంబులు, స్వయంవరోత్సవము దర్శింపవచ్చిన జానపదులకు విడుదులయి యుండి, యింకను వచ్చుచుండువారల కెడము దొరకుటయె కఱవయ్యెను. కూడవచ్చిన పాండవులును, బ్రాహ్మణులును వేరుపడిరి. పాండవు లందందు వెదకి యెందును దగిన చోటుగానక, యెట్టకేలకు నొక కుమ్మరవాని యింట దిగి, తమ్మెవ్వరు నెఱుంగకుండ బ్రాహ్మణవృత్తినే యుండిరి.

## V

నాఁడు స్వయంవర దినము. కాంపిల్యపురంబు గడు సంభ్రమించుచుండెను. స్వయంవరోత్సవ దర్శనాగతులగు ప్రకృతిజనంబులు పురశృంగారములం గాంచుచుఁ జందనోదకసిక్త విశాలవీధుల నడయాడుచుండిరి. రత్నతోరణములు, మకర తోరణములు, కలువడములు, పుష్పఫల గుచ్ఛసంయుతరంభా స్తంభాలంకృతములగు కృత్రిమ ద్వారములు, చిత్రవస్త్రప్రసాధిత గోపురములు, సుధావిలిప్త గృహములు, సుందర రంగవల్లీ రచిత గృహప్రాంగణములు, ఉత్తుంగ సౌధశిఖరంబుల నల్లలనాడు చిత్రతర కేతనవితానములును వారికి లోచనపర్వంబు గావించుచుండెను. స్వయంవర భవనంబు

చాయ, వివిధ తూర్యారావములు చెలఁగఁగా నక్కడ కనేకులు చనుచుండిరి.

స్వయంవరభవనము, పురంబుపూర్వోత్తరదిగ్భాగమున నుండెను. అది బహువిశాలమగు ప్రాకారమధ్యమున నుండెను. ప్రాకారకుడ్యముచుట్టును వెలుపట నాయుధపాణులగు భటులు నిలిచియుండిరి. చక్కఁగ నలంకరింపఁబడిన విశాలద్వారములకడ నుండు భటశ్రేష్ఠులు జనుల మూఁకలను దూరమున నుండఁజేయుచుండిరి. రాజపుత్రు లశ్వముల మీఁదఁ గొందఱు, భద్రగజంబులమీఁదఁ గొందఱు, కాంచన రథంబుల మీఁదఁ గొందఱుఁ బుత్తెంచిరి. మొగమున దిట్టముగ విభూతి పెండెకట్లు దీర్చిన బ్రాహ్మణులనేకులు నిర్నిరోధముగ లోనికిం జనుచుండిరి.

ఆవరణము నందు రమణీయారామమును, జలయంత్రంబులును గలవు. స్వయంవర భవనము బహువిశాలమయి యున్నతముగ నుండును. పురోహితుఁడును, యువరాజగు ధృష్టద్యుమ్నుఁడును, వచ్చిన రాజకుమారుల బ్రాహ్మణ ప్రవరులఁ బౌరశ్రేష్ఠుల, నెదురుకొనఁగా, వారు తాఁగతిమ్మ్యానుసారముగా నలవరింపఁబడిన యాసనములమీఁద యథోచితముగాఁ గూర్చుండిరి. సభాసదుల కెదురుగా భవనావరణమున నుండు

గొప్ప బయలున దూరముగా నంతరిక్షమున యంత్ర మత్స్యంబు గిరగిరం దిరుగుచు, వచ్చినవారి దృష్టి నాకర్షించు చుండెను. అది మిక్కిలి యెత్తుమీద నుండుటచేఁ బ్రాకారము వెలుపలనుండు జనులకుఁగూడ గోచరమగు చుండెను. అంత ద్రుపదరాజు, కూఁతును నామెతోడ నామెచెలికత్తెను దోడ్కొని, స్వయంవర రంగమునకు విచ్చేసెను. ఘోరన శబ్దించు వాద్యంబులును జనుల యులివులును నణఁగెను. ద్రుపదరాజా లతకూనల నుచితాసనములఁ గూర్చుండబెట్టి, తన యాసనమును స్వీకరించి, రాజలోకంబుదెస దృష్టిసారించెను. దుర్యోధన దుశ్శాసనాదులును; శిశుపాల, జరాసంధ, శల్యకర్ణులును; అక్రూర సాత్యకి, సాంబ, సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధులును; బలరామ కృష్ణులును, ఇంక ననేక దేశాధీశులును నందుండిరి. కాని పాండవుల యునికియే పొడకట్టలేదు. వారందున్నారని యెవరు చెప్పఁగలరు?

బ్రాహ్మణ వేషంబుల సభలో బ్రాహ్మణమధ్యముననుండు పాండవులు భస్మంబు మధ్యమున నుండు నగ్నికణంబులవలె నెవరికిఁ దెలియఁబడక యుండిరి.

అంత ధృష్టద్యుమ్నుఁ డార్యుల యనుమతిని దన యాసనంబునుండి లేచి మూఁగిన సభాసదుల నెల్లంగని

"కార్ముక విద్యాధౌరేయులార! ఈమె నా చెల్లెలగు ద్రౌపది. సుగుణవతి. ఈధనుస్సును మోపెట్టి యైదు బాణములచేత నంబుఁ దిరిగెడు లక్ష్యమును నేసిన యతం డీకన్యకు భర్తయగును. ఇప్పుడు మీ బాహుబల కర కౌశలంబులఁ జూపవచ్చును." అని పలుకుచున్న ద్రౌపదిని, ముందరనున్న శరశరాసనంబులను, మింటఁదిరుగు యంత్రమత్స్యంబునుఁ, జేచాయఁ జూపుచు వచించెను. రాజపుత్రులు ద్రౌపదీ మనోహరరూపముం దిలకించి, మదనార్తులయి, తమ్మును దమసామర్థ్యమును దెలియఁగక యొకరి తరువాత నొకరు ముందునకు వచ్చి యా విల్లు మోపెట్టఁ గడఁగిరిగాని, వారికది కడునసాధ్యము గాఁగ వెన్కకు మరలుచుండిరి. శిశుపాల, జరాసంధ, శల్య, కర్ణులు సంరంభించి క్రమముగా రంగంబునకు వచ్చిరిగాని వారును ధనుస్సు మోపెట్టలేకపోయిరి. కృష్ణుఁడూర కుండుటంగని, బలరాముఁ డందులకుఁ గారణంబడుగఁగా దానికిఁ గృష్ణుఁడిట్లు బదులు చెప్పెను. "ఆ విప్రుల మధ్యమున బాండవు లున్నవారు. వారిలో నర్జునుఁ డీ మత్స్యము నేయును. ద్రౌపది యాతని వరించును." అదివిని, బలరాముఁడు మిక్కిలి సంతోషపడెను.

కృష్ణ బలరాములు తన్నుఁ జూచుచుండఁగా బ్రాహ్మణుల నడుమనున్న యర్జునుఁడు, ధర్మరాజు

నను జ్ఞగైకొని, ధనుస్సమీపమునకు వచ్చెను. ఆతని ధైర్యోత్సాహములకు విప్రులందరు నాశ్చర్యపడిరి. రాజపుత్రులు "పేదబాపఁడెక్కడ? నిపుణులకు సహితము మోపెట్ట శక్యముగాని యాధనుస్సెక్కడ?" అని విప్రరూపముననున్న యర్జునుని దూలనాడిరి. అర్జునుఁడు పూర్వ పరిచితమగు దానిఁబోలె నా ధనుస్సునెత్తి, యశ్రమమున నెక్కుపెట్టి యొక్కబాణమున యంత్రమత్స్యంబు తెగనేసెను. బ్రాహ్మణుల సంతోషము చప్పట్ల రూపమున వెలువడెను. రాజపుత్రులు సిగ్గుచే నవనత శిరస్కులయిరి. తన చెలి యందీయఁగా, ద్రౌపది పుష్పహారమునుగొని సిగ్గుపడుచు వచ్చి యర్జునుని కంఠమున నునిచెను. అప్పుడు వివిధవాద్యములు ఘోషించెను. బ్రాహ్మణులు కొందఱు తమ వస్త్రంబులు వీచివీచి యాడిరి. మఱికొంద ఱాశీర్వదించిరి. అంత ధర్మరాజును, నకుల సహదేవులును, దమ బసకు వెళ్ళిరి.

మత్స్యయంత్రము నేసిన యవ్విప్రబాలకుని మెడయందు ద్రౌపది పుష్పదామకంబు వేయుటఁ జూచి, దుర్యోధనాదు లోర్వలేక, ద్రుపదుతోడఁబోరునకు దిగిరి. భీమార్జునులు ద్రుపదునకు సాయంబుగా వెడలిరి. దుర్యోధనుఁడు చూచుచుండఁ గర్ణుఁ డర్జునుని దాఁకెను;

శల్యుఁడు భీముని మార్కొనెను. అర్జునుఁడేయు బాణ పరంపరను వారింపనేరక, బ్రాహ్మణు లజేయులని తల పోసి, కర్ణుఁడు పోరుమాని, "అల భార్గవుఁడు, శివుఁడు, అర్జునుఁడు దప్ప మఱేరును నాతోఁబోర నేరరు. నీవిల్లు నేర్పునకు మెచ్చితి" ననెను. భీముఁడు శల్యుని నేలం ద్రెళ్ళవేసెను. దుర్యోధనాదు లవ్విప్రయువకుల పౌరుష పరాక్రమంబులు సూచి, విస్మితులయి, వా రెవ్వరై యుందురో యెఱుంగవలయునని యుండిరి. అప్పుడు కృష్ణుఁడు నడుమవచ్చి వారికి బుద్ధిమాటచెప్పి, పోరు వారించెను. రాజపుత్రులు తమతమ దేశంబుల దారి పట్టిరి. అంత భీమార్జునులు తమ విడిసినచోటికిఁబోయిరి.

## VI

అటఁ గుంతి యుత్సవ దర్శనోత్సకులై వెడలిన తన పుత్రులేల తడసిరో యని పరిపరివిధముల నాలోచ నలుపోవ దిగుల్పడి యుండెను. స్వయంవర భవనంబు విడిచిపోయిన ధర్మరాజును నకులసహదేవులును, నప్పుడ యింటిలోఁ బ్రవేశించిరి; వెంటనే భీమార్జనులు ద్రౌపదీ సమేతముగా వచ్చిరి; అర్జునుఁడు "మే మొకభిక్ష దెచ్చితి" మని తల్లికిఁ జెప్పగా, నెప్పటివలెగాఁ దలంచి, మీరేవురు నుపయోగించుఁ గొనుఁడని నుడివి, పిదపఁ ద్రిభువ

నైక లక్ష్మియగు నక్కన్యంజూచి దిగ్భ్రమచెంది, ధర్మరాజుంగని, "నేను తప్పఁబలికితిని, నా పలుకింతకుఁబూర్వ మెప్పుడును నబద్ధము గాలేదు. మీరును నామాటకు జవదాటుట లేదు. లోకమున నింతకు మున్నెప్పుడును జరుగని ధర్మవిరుద్ధమగు కార్యమును జేయుఁడని వచించితిని. దీనికిఁ బరిహారము నాకుఁ దోఁపకున్నది." అని మిక్కిలి చింతాకుల యయ్యెను. ధర్మరాజాపెను నూరార్చి, యర్జునింగాంచి "నీవు సంపాదించిన పడుచును నీవే యగ్నిముందర వివాహమగుము." అని చెప్పగా దాని కర్జునుఁడు "పెద్దవాఁడుండగాఁ బిన్నవాఁడు వివాహమగుట యధర్మము; కావున నీవె యామెను నగ్రమహిషిగాఁ గైకొనుము" అని బదులు పలికెను. అది విన్నదాదిగా, దైవమాయ యేమొగాని, ధర్మమార్గైకతత్పరులగు పాండవుల కేవురకును ద్రౌపదిపై మోహంబు జనింపగా, వారామెను వలపుఁజూపులఁ జూడసాగిరి. ద్రౌపదియు వారేవురియందును బద్ధానురాగ యయ్యెను.

ఇట్లుండ, నాకుంభకారుని గృహమునకు బలరామకృష్ణులు వచ్చి, కుంతికిని ధర్మజునకును మ్రొక్కి భీమార్జున నకులసహదేవులను గౌఁగిలించుకొని సంతోషపరవశులయి యుండిరి. ధర్మరాజు వారిక్షేమము విచా

రించి, "మీరెల్లరు మమ్ము గుర్తింపఁగలిగితిరి!" అని యడుగఁగా, దానికిఁ గృష్ణుఁడు "ఆమత్స్యయంత్రము నేయు సామర్థ్య మర్జునునకుఁ గాక మఱెవ్వరికిఁ గలదు? మీ పరాక్రమమె మిమ్ము నెఱింగించె. దుర్యోధనాదు లొనర్చిన మాయలకుం దప్పితిరి. ఇంక మీకు శుభం బగును" అని చెప్పి, బలరామునితోఁ దరలిపోయెను.

అంత భీమార్జున నకులసహదేవులు నలువురు యథారీతి బ్రాహ్మణశ్రేష్ఠుల గృహంబులకుఁ బోయి భిక్షాన్నముఁ దెచ్చి దానినంతయుఁ దల్లి కొప్పగించిరి. ఆమె ద్రౌపదిని బిలిచి, "అమ్మాయీ! యాఁకలి గొని వచ్చిన యీ యతిథులకు ముందుగా నన్నము పెట్టుము. పిదప నున్న యన్నమును రెండుభాగములుచేసి, యొక భాగమును నీ పెద్దకడుపువాఁడగు భీమునకుఁ బెట్టి, యింకొక భాగ మానలువురకు వడ్డింపుము. అందఱు దినఁగా నిలిచిన యన్నమును నీవును నేనును దినుదము". అని చెప్పిన, ద్రౌపది కుంతిచెప్పినరీతి నందఱకు భుజింపఁబెట్టి తానును భుజించెను. రాత్రివేళ గడ్డిపఱుపులు పిదిర్చి వానిమీఁద వారివారి కృష్ణాజినంబులు పఱచి, యందఱకు శయనమ్ము లిమ్ముగా రచించెను. అందఱుఁ బరుండినతరువాత వారి పాదములక్రిందఁ దానును బండుకొనెను. ద్రౌపది యాగర్భశ్రీమంతురాలయినను దుస్స్థితి

యందున్న పాండవులను గాంచు నాదరించె నేగాని
యేవగింపదాయెను.

## VII

ఆ మఱునాఁడు ద్రుపదుండు చింతాకులుఁడై, తన కొమార్తెకు వరుండయినవాని కులగోత్రనామములెఱింగి వచ్చుటకుఁ దన పురోహితు నంపెను. పురోహితుఁడు బ్రాహ్మణ సహితుఁడయి, పాండవులుండు గృహంబునకువచ్చి ధర్మరాజుం గాంచి, "అయ్యా! మా రాజు చింతావశుండయి యున్నవాఁడు. మీ రెవ్వరో, మీ కులగోత్రంబు లెవ్వియో, యెఱింగించుండని మమ్మంబనిచె. దయచేసి వానిని మా కెఱింగింపుఁడు." అని యడుగఁగా, ధర్మరాజు "స్వామీ! బలహీనునకు మత్స్యయంత్రంబునేయ సాధ్యమగునా? మీరాజు మనోరథంబీడేరెను. చింతింపనేల?" యని ప్రత్యుత్తర మిచ్చెను. పురోహితుఁడు దాని యర్థమును గ్రహించి, వెనుకకు మరలి, ధర్మరాజు పలికిన పలుకులను ద్రుపదరాజునకుఁ దెలిపి, వారు పాండవులై యుందురని నమ్మఁబలికెను.

అంత ద్రుపదుఁడు ధృష్టద్యుమ్నుఁ బిలిపించి, వివిధ రథంబులం గొనిపోయి వారలం దోడితెమ్మని పలికెను. ధృష్టద్యుమ్నుఁ డప్పుడు చతుర్వర్ణములవారి

కనువులగు పలు తెఱంగుల యరదంబులం గొని, పాండవుల యొద్దకువచ్చి, "ద్రుపదరాజు మిమ్ముఁ దోడ్కొని తేర నన్నుంబంచినాఁడు. మీరీరథంబులెక్కి రండు." అని పలుకఁగా, వారు కుంతీద్రౌపదీసహితులయి, రాజోచితంబులగు కాంచనరథంబులెక్కి, ధృష్టద్యుమ్నునివెంట రాజమందిరమునకుఁ జనుదెంచి, రాజయోగ్యములగు నాసనముల స్వీకరించిరి. ద్రుపదుండు తన సంశయమును బూర్తిగ నివర్తిచేసికొనఁ దలంచి, ధర్మరాజుం గాంచి "అయ్యా! మీరు క్షత్రియులరో, బ్రాహ్మణులరో మాయావులై తిరుగుచుండు మంత్రసిద్ధులరో, కాక కన్యం బరిగ్రహింప స్వర్గమునుండివచ్చిన దేవతలరో మేమెఱుంగము. మాకు సందేహముగా నున్నది. మీకలరూపెఱింగించి మా సంశయమును బోఁగొట్టుఁడు. జేపే యగ్ని సన్నిధిని వివాహము చేయనున్నాము" అనెను. అనుడు ధర్మరాజు "మేము పాండురాజ పుత్త్రులము. మత్స్యయంత్రమును నేసినయాతఁ డర్జునుఁడు. ఈతఁడు భీముఁడు. రలిరువురు నకులసహదేవులు. ఈమె మాతల్లి." అని వారినెల్లఁ జేచాయఁజూపి యెఱింగించెను. ద్రుపదరాజానంద బాష్ప నయనుండయి, "మాకభిమతుఁడయిన అర్జునుఁడె ద్రౌపదికి వరుఁడయ్యె. ఇది మాభాగ్యము. యజ్ఞసేనుం డీమెను నెప్పుడు వివాహమగును?" అని

యడిగెను. అందునకర్జునుండు "అగ్రజులగు ధర్మరాజును భీముఁడును నవివాహితులయియుండగాఁ జిన్నవాఁడనగు నేనెట్లు పెండ్లియగుదును? అది ధర్మ విరుద్ధము గదా?" యని నుడివెను. "అట్లయినచో ధర్మరాజే యక్కన్యను వివాహ మగుఁగాక." అని ద్రుపదుండు బదులు పలికెను. అప్పుడు ధర్మరాజు, "ఇక్కన్నియను మేమైదుగురము వివాహ మయ్యెదము. మాతల్లి వచన మిట్టిది. అది దాఁటరానిది" అనియెను. దానికి ద్రుపదుండు "ఒక్క కన్యకకు బెక్కండ్రు పతులుండుట యశ్రుతపూర్వము. సకల ధర్మస్వరూపము నెఱింగిన మీ పలుకులు ధర్మవిరుద్ధములని చెప్పఁజాలను. అయినను బెద్దల విచారించి తేఁపు నిశ్చయము చేయుదము." అని పలికి, వారలం దోడ్కొనిపోయి, సర్వవస్తుచయములతో నమరిన చక్కని విడుదులందు విడియించెను.

మఱునాఁడు వ్యాసమునీంద్రుఁడు ద్రుపదుగృహంబునకు వచ్చెను. అందఱు సమయోచితమగు నాతని రాకకు సంతోషపడిరి. కుంతీదేవియుఁ బాండవ పాంచాలురును నాతనికిఁ గడుభక్తి మ్రొక్కి యాతిథ్యపూజలాచరించిరి. పిమ్మట ద్రుపదుం డమ్మహాముని కిట్లనియె "మునిసత్తమా! ధర్మతత్త్వ మెఱింగిన యా ధర్మరాజు, తామేవురును మా ద్రౌపదిని వివాహ మాడెదమని

పలికెను. తాము విచారించి ధర్మాధర్మ నిర్ణయము చేయవలయును." అనఁగా నమ్మునితిలకుండు, "ధర్మ పరావతారుండగు ధర్మజునకు నధర్మమునందు మనసు దగులదు. ఆతఁడట్లపేక్షించుటకుఁ గారణాంతరమున్నది. ఒకానొక మునికన్యక దాను దనకర్మవశమున మగనిం బడయలేక, బహుకాలంబు కన్యాత్వముననుండి, తుదకు దనదౌర్భాగ్యమునకు నిర్వేదపడి శివునింగూర్చి ఘోర తపంబు చేసెను. అంతట మహేశ్వరుఁడు ప్రత్యక్షు మయి, వరంబు గోరుమని పలుకఁగా, నప్పుడా కన్య 'పతిభిక్ష సేయుఁడు, పతిభిక్ష సేయుఁడు' అని యట్లయిదు మారులు వేఁడెను. 'అట్లయినఁ బునర్జన్మమునందు నీ కేవురు పతులగుదు'రని శివుండు వరంబిచ్చెను. ఆ ముని కన్యయె యిప్పుడీ ద్రౌపదిగాఁ బుట్టినది. కావున నిక్కన్యను పాండవుల కేవురకు నిచ్చి వివాహము చేయుము. ఇది మనముచేసిన పనిగాదు. దైవనిర్ణయము" అని పలికి ద్రుపదరాజు నొడంబఱచెను.

అంత ద్రుపదరాజు ద్రౌపదీవివాహం బెల్లియే యని చాటఁ బంచెను. అలంకరించిన పురం బలంకరించి నట్లె యుండెను. వచ్చిన జానపదులు తమ గ్రామంబులకుఁ బోక నిలిచిరి.

నగరులో నందఱును ప్రభాతవేళ లేచి తమతమ

పనులను ససంభ్రమమునఁ జేయుచుండిరి. ఒక శంపాంగి ద్రౌపదికి జడయల్లిక విప్పి, సంపంగి నూనె యంటెను. ఒక ఘనవేణి తేట నులివెచ్చనీరును దనకుఁ గాంచన కలశంబులఁ గొంద అందీయఁగా, జలక మార్చెను. ఒక జలజపాణి చలువ దువ్వలువచేఁ దడియొత్తెను. ఒక పద్మగంధి ధూపంబు సంధించెను. ఒక నిపుణవతి నిడుద కీల్జడయల్లెను. ఒక యుత్పలాక్షి కాటుకదీర్చెను. ఒక విశాలఫాల నొసటఁ జిత్రకంబులరచించెను. ఒకశుకవాణి చీనాంశుకము గట్టెను. కోకిలాదేవి పేటికం దెఱచి, మణిభూషణంబులఁ బళ్ళెరంబుల నందీయ, నొక లతాంగి యొడల ఘటించెను. ఒక పూఁబోడి కుసుమ మాలికలం దుఱుమునఁ ముడిచెను. అట్లు చెలులు ద్రౌపదికి మంగళ స్నానాలంకారముల నొనరించి వివాహ మంటపమునకుఁ దోడ్కొనిపోవ సిద్ధపడిరి.

పాండవు లేవురును గృతమంగళ స్నానులయి వరోచితవస్త్రాలంకారముల ధరించియుండిరి. పురోహితుఁడగు ధౌమ్యుఁడు, వివాహమండపమునకుఁబోవ వేళాయెనని నేరింపఁగా నందఱు నగరునుండి తరలిరి. వెలుపట వివిధతూర్యారావములు సముద్రఘోషవలె మ్రోఁగసాగెను. పాండవులు భద్రగజంబుల నధిరోహించిరి. అంతఃపుర స్త్రీలు ద్రౌపదితోడఁ బల్లకుల నారోహించిరి.

ద్రుపదుండు బంధుమిత్ర పురోహిత మంత్రి వర్గంబుతోఁ బాదచారమున వెడలెను. ఇట్లు బయలువెడలిన యుత్సవశ్రేణి వివాహమండపంబు చేరెను. అప్పుడు ప్రాగ్దిశాకాంత వధూవరుల కారతిచేయనెత్తిన పసిండి పళ్ళెరమోయన సూర్యుఁడెఱ్ఱఁగఁ దోచెను. అందఱు నిండిన వివాహ మండపములోనికిఁ జనిరి. అందొక్కెడ వైణికుల వీణాస్వనంబులు చెలంగుచుండెను. మఱొక్కెడ వైణుకుల వేణునాదంబులు చెవులం దనుపుచుండెను. ఇంకొక్కెడ గాయకుల మధుర గీతంబులు విస్తరిల్లుచుండెను. ధౌమ్యుఁడు పాండవుల నేవురను దోడ్కొని వివాహోచితములగు నుపకరణ ద్రవ్యంబులు పఱచిన వివాహవేదికం గూర్చుండఁ బెట్టెను. ద్రుపద రాజు ద్రౌపదిం దోడితెచ్చి పెండ్లిపీఁటమీఁద నిలిపెను. ధౌమ్యుఁడు తొలుదొల్త నగ్రజుఁడగు ధర్మజునకు ద్రౌపదిని బాణిగ్రహణంబు చేయించెను. పిమ్మట వరుసగా భీమార్జున నకుల సహదేవులకుఁ బాణిగ్రహణంబు చేయించెను. అప్పుడు విప్రాశీర్వాదంబులు, ముత్తైదువల శోభనగీతంబులు మొరసెను.

# సుభద్రోద్వాహము

అట్లు పాండవు లేవురు ద్రౌపదిని పెండ్లాడి ద్రుపదుపురంబున సకలభోగము లనుభవించుచు నొక్క-యేఁడాది సుఖంబుండిరి. ఇట్లుండ దుర్యోధనునిచారులు వారిని గుఱుతించి, హస్తిపురంబునకుఁ జని, మత్స్యయంత్రంబు నేసిన బాహుబలాఢ్యుఁడు పాండవమధ్యముఁడగు నర్జునుఁడనియు, రణమున శల్యకర్ణుల పీచమడంచిన యున్నతప్రతాపులు భీమార్జునులె యనియుఁ బాండవు లేవురును ద్రౌపదిని వివాహమయిరనియు, దుర్యోధనునకుఁ దెలియఁజెప్పిరి. దుర్యోధనుఁడు సక్రోధుఁడయి, పుత్రమిత్రబాంధవబలసంపన్నుఁడగు ద్రుపదరాజునొద్దఁ బాండవు లున్నంతదనుక వారిని గెలుచుట యశక్యము గావున, ద్రుపదుఁడు పాండవులను విడుచునట్లు చేయవలెననియుఁ, గుంతీపుత్రులగు ధర్మజభీమార్జునులకును మాద్రితనయులగు నకులసహదేవులకును బరస్పర విరోధంబు గలిగింపవలయుననియుఁ, బాండవులను ద్రౌపదియం దనురాగము లేని వారినిగాఁ జేయవలెననియు, మాయోపాయముల నర్జునుని యమపురి కనిపి

మిగిలిన వారిని బలహీనులనుగాఁ జేయవలెననియు యోజించిచుండెను. కర్ణున కీయుపాయంబు రుచింప దయ్యె. అతనికి విక్రమంబు ప్రయోగించి పాండవుల నాలమున గెలువవలెననియె కోరిక. కర్ణుఁడు తన యభిప్రాయమును ధృతరాష్ట్రునకు నెఱింగింప, నాతఁడు "అట్లు చేయుటయె మంచిది; కాని మతిమంతులతో విచారము చేయుఁడ"మని నుడివి భీష్మద్రోణ విదుర కృపాశ్వత్థామాదులను రాపించి వారికంతయు నెఱింగించెను. కాని, వారు పాండవులతోడఁ బగబూనుట కొడంబడక "తండ్రి తాతలనుండి పరంపరగా వచ్చిన రాజ్యమునకు మీవలెనే వారును నర్హులు కావున వారిని బిలిపించి, యర్ధరాజ్యమును వారికిఁ బంచియిచ్చి, లక్కయింటి విషయమగు నపకీర్తిని బాపికొనుటయె శ్రేయము," అని యుపదేశించిరి. దానికి ధృతరాష్ట్రుఁడు సమ్మతించి, పాండవులను దోడితేర విదురుని బనిచెను.

విదురుఁడు ద్రుపదుపురంబునకుఁ జనియెను. అప్పుడు కృష్ణుఁడును నందె యుండుట తటస్థించెను. కృష్ణ పాండవులసమక్షంబున ద్రుపదరాజునకుఁ దాను వచ్చిన కార్యము నివేదింపఁగాఁ బాండవుల కెల్లవేళల హితంబు దలంచు విదురునిరాక పాండవులకు శుభసూచకముగా నెఱింగి, ద్రుపదరాజు కృష్ణానుమతంబున వారి ప్రయాణ

మున కంగీకరించెను. పాండవులు, ద్రుపదుని కృష్ణభగవానుని యనుమతిం బడసి, కుంతీ ద్రౌపదీసహితముగా హస్తిపురంబునకుఁ బయనమయిరి. ద్రుపదరాజు గౌరవార్థము తన కొమారుఁడగు ధృష్టద్యుమ్నుని సముచిత సేనా సమేతముగా, వారివెంటఁ బంపెను.

అట హస్తిపురమున ధృతరాష్ట్రుఁడు పాండవుల రాకవిని, వికర్ణ చిత్రసేన ద్రోణ కృపాచార్యాదులను వారికెదురుగాఁ బంపెను. పాండవులు పౌరజనులు సంతసిల్ల, మహోత్సవంబున హస్తిపురంబుఁ బ్రవేశించిరి. ఇట్లువచ్చి భీష్ముఁడు ధృతరాష్ట్రుఁడు మొదలుగాఁగల కురువృద్ధులకుఁ జాఁగిలిమ్రొక్కి వారిదీవనలం బడసిరి. దుర్యోధనాదులతో నెప్పటివలె కలసి మెలసియుండి వినోదంబులఁ గాలంబు పుచ్చుచుండిరి.

## II

ఇట్లు కొంతకాలము గడచెను. అంత నొక్కనాఁడు సర్వలోకసాక్షియగు కృష్ణభగవానుఁడు సాక్షిగాఁగ, భీష్మ విదుర ద్రోణ దుర్యోధనాదుల సమక్షమున, ధృతరాష్ట్రుఁడు పాండవుల కర్ధరాజ్యముగా ఖాండవప్రస్థము నిచ్చెను. పాండవులు కొంతకాలము ఖాండవప్రస్థమునఁ గాఁపుర ముండిరి.

కృష్ణునకుఁ బాండవులన్న మిక్కిలి యనురాగము. అతఁడు పాండవుల రాజ్యమునకుఁ దగిన రాజధాని యొకటి నిర్మింపఁబడుట యావశ్యకమని తలఁచి, తన యిచ్చను దేవేంద్రునకుఁ జెప్పఁగా, నతఁడు పురనిర్మాణ కుశలుండగు విశ్వకర్మను బనిచెను. అవ్విశ్వకర్మ యింద్రు పురమగు నమరావతితో సమానమగు పురమును నిర్మించెను. ఆపురవరమునకు నింద్రప్రస్థమను పేరిడఁబడెను. దానిని గట్టుటయే తడవుగాఁగ ధర్మప్రభువగుధర్మరాజు పాలనమున నుండవలెనని యెంచి, దేశదేశముల జనులింద్రప్రస్థమునకుఁ గాఁపురముండ వచ్చిరి.

పురనిర్మాణముపూర్తియయినతోడనే, ధర్మరాజు యొక్క పట్టాభిషేక మహోత్సవము చాటింపఁబడెను. సకలదేశముల రాజులకును, బంధుమిత్రులకును నాహ్వాన పత్రికలు పంపఁబడెను.

రాజన్యులు, బంధుగులు, మిత్రులు వచ్చిరి. హస్తి పురంబునుండి దుర్యోధనాదులు వచ్చిరి. కాంపిల్యము నుండి ద్రుపదాదులు విచ్చేసిరి. ద్వారకనుండి గదుఁడు, సాత్యకి, ప్రద్యుమ్నుఁడు లోనగు పురుషులును,సత్యభామ రేవతిమున్నగు స్త్రీజనమును బిడ్డలతోడ సపరివారముగా పట్టాభిషేక దినమునకుఁ గొన్నిదినములు ముందుగా వచ్చియుండిరి. కృష్ణబలరాములు వీలులేమిచేరాలేదు.

ఈయాదవులకు నగరులో నొకభాగము విడిది గావించియుండిరి. వారి విడిది యర్జునుసౌధమునకు దాపలనె యుండెను. పట్టాభిషేక దినమునకుఁ బూర్వ రాత్రి యర్జునుఁడు తనమేడలోఁ జదువుచుఁ గూర్చుండి యుండగా సమీపమున నాటలపాటల ధ్వనులు వినఁ గలిగెను. ఆతఁడు దిగ్గునలేచి కిటికీనుండి తొంగిచూచెను. పెక్కండ్రు రాజకన్యకలు గుమిగూడి పాడుచు నాడుచుండుటను దిలకించెను. వారియెదుటఁ గనకపీఠముమీఁద సమర్పించిన పువ్వులు, పసుపు, కుంకుమము, చందనము, వస్త్రము, వీనిచే నలంకరింపఁబడిన మన్మథుని చిత్రపటమును వీక్షించెను. ఆగుంపులో సత్యభామ మిత్రవింద లోనగు యాదవభామలను గనుఁగొని, వారా మేడమీఁద బండువెన్నెలలో మన్మథపూజ నిర్వహించుటగా నెఱింగి, యావినోదములఁ గాంచుచు నిలఁబడెను. కన్నెలపయి దృష్టిసారించెను. అందొక కన్యాలలామ యాతనిదృష్టి నాకర్షించెను. ఆమె విగ్రహము పొడువును గాక, కుఱుచయుగాక, స్థూలమునుగాక, పలుచనయుఁగాక, మధ్యస్థితి వహించియుండెను. శృంగారరస మొలికెడి యామె ముఖభావము నాఁటి పండువెన్నెలవలెఁ గడు శాంతపరిపూర్ణము. నిడుదలై సోగలైన కన్నుల నుండి వెడలెడు వీక్షణములు కపటభావ శూన్యములు.

నాసికసమగ్రమై చంపక సుమసదృశము. ఆసోయగఘుకీని యెవతెయొ యెఱుంగ నర్జునుని మన స్సురియాడు చుండెను. బాలికల పరస్పర సంబోధనముల వలనను, సంభాషణముల వలనను, నా పడుచుఁగన్నె కృష్ణుని చెలియలగు సుభద్రయని తెలిసెను. అర్జునుఁడాబిడను జూచుట యిదియె మొదటిసారి. ఉదయమున గదుఁడు వర్ణించిన యామె సోయగ మిప్పుడు తెలుఁపునకువచ్చెను. ఆమె సుభద్రయని విన్నదాదిగ నామెపైనఁ దృష్టులు గ్రుమ్మరించుచుండెను. అంతఁగొంత సేపటికి మన్మథపూజ ముగిసెను. బాలిక లాటలఁ బాటలఁ జాలించిరి. సత్యభామాదులు ముందు నడువగా నందఱు నేఁడదిగిరి. అర్జునుఁడువచ్చి దంతపు మంచముమీఁద హంసతూలికా తల్పముపైనఁ బరుండెను. ఆతనికిఁ ద్వరగా నిద్రపట్టలేదు. సుభద్రాసురుచిరరూప మాతని మనోవీథి నర్తనము చేయుచుండెను. ఆ లావణ్యవతి తనకు లభ్యపడునో పడదోయని వితర్కింపఁ జొచ్చెను. అట్లు వితర్కించు చుండ నాతనికన్నులుమూతవడియెను. నిద్రవచ్చెను.

## III

నాఁడు ధర్మరాజు పట్టాభిషేక మహోత్సవము. నానావిధవాద్యఘోష భూనభోంతరాళములఁ బూరటిల్లె.

ఇంద్రప్రస్థపుర మీనెనో యన, జను లెల్లకడల మూఁగియుండిరి. పురమధ్యమందలి విశాలములగు మైదానములలో నసంఖ్యాకము లయిన తెల్లని పటకుటీరములు వెలుఁగొందుచుండెను. కమనీయ తోరణాలంకృతములయిన శిబిరములందు విడిసిన రాజులు, సామంతులు, శ్రీమంతులు తమ తమ పరివారములతోఁ బట్టాభిషేక మండపమునకుఁ దరలి యటుఁజేరిరి. భీమార్జున నకుల సహదేవు లుత్తమ ఘోట్టాణములెక్కి వెంటరా, నాయుధులగు యుద్ధభటులుగలసికొలువ, వివిధతూర్యారావంబులు మొరయ, వందిబృందము స్తోత్ర పాఠములఁ బఠింప, మాగధస్తోమము వంశవీర్యాదులఁ బొగడఁ, బ్రజల జయజయ శబ్దంబులు బోరుకొనంగ, ధర్మరాజు భద్రగజమారోహించి పట్టాభిషేక మండపమున కరుదెంచెను. పాండవుల యాచార్యుఁడు ధౌమ్యుఁడు, గంగాతోయముల ధర్మజున కభిషేకము గావించి, యాతని మూర్ధము మీఁద సమంత్రముగాఁ గిరీటముంచెను. అప్పుడు సభాసదులు నిలఁబడి జయజయ ధ్వనుల నేకగ్రీవముగాఁ బలికిరి. భూసురు లాశీర్వదించిరి. ధర్మదేవతాపరావతారుఁడగు ధర్మరాజు తనకుఁ జిరకాల మొడయుఁడగుటకుఁ బ్రజలు కీర్తించిరి.

మాపున నూరేగింపు వెడలెను. ఉత్సవశ్రేణి

కగ్రభాగమున ధర్మరాజు కూరుచున్న రథ ముండెను. అర్జునుఁడు సారథ్యంబు చేయుచుండెను. భీమ నకుల సహదేవులు ఛత్ర చామరములఁ బట్టుకొని పార్శ్వంబుల నిలిచి యుండిరి. ఆ రథమునకు నంగారపర్ణుఁ డొసఁగిన దేవగంధర్వ తురగములు గట్టియుండిరి. దాని వెనుక ద్రుపదమహారాజును, దుర్యోధనుఁడును శ్రేష్ఠములగు గుఱ్ఱములెక్కి జోడుగ వచ్చుచుండిరి. వారి పిఱుఁద దుశ్శాసనాదు లుండిరి. సామంతరాజులు వారి ననుగమించుచుండిరి. ఈ యూరేగింపు జనతరంగములతో ఘూర్ణిల్లి యిసుకచల్లిన రాలని చందమున నుండెను. వివిధవాద్యఘోష దిగ్గజములఁ జెవుడుపఱచుచుండెనో యన మ్రోఁగుచుండెను. స్త్రీజనంబులు చిత్రవిచిత్రాంబరముల ధరియించి మిద్దెలమీఁద, మేడలమీఁద నుప్పరిగలమీఁదఁ, జంద్రశాలలమీఁదఁ గిక్కిఱిసి యుండి, రథము తమ్ము సమీపింపఁగా హస్తములందలి కంకణంబులు క్రేంకారముల నీన రాజుపైఁ బుష్పములు వైచుచుండిరి. సత్యభామయు సుభద్రయు నుండు మేడకు సరిగా రథమువచ్చి నిలువఁగా వారును బుష్పములు చల్లిరి. ద్వారకకుఁ బాండవులు రాకపోవుటచేత, సుభద్ర వారినిజూచి యెఱుఁగదు. కావున నామె సారథిని జూపుచు నా తేజోవంతుఁడెవరని సత్యభామను నడుగఁగా

నామె పంచ పాండవులను వివరముచేసి చెప్పెను. అంతలో రథముకదలి దాటిపోయెను, సత్యభామయు సుభద్రయు నింటిలోనికిఁ జనిరి

అర్జునుని దర్శించినది మొదలు సుభద్రకుఁ జిత్తస్వాస్థ్యములేదు. ఆమె తలఁపున నేమేమో యూహలు పాఱుచుండెను. అర్జునుని విషయమంతయు సత్యభామను నడిగి తెలిసికొనెను. పాండవు లేవురకును ద్రౌపది యొక్కతెయే భార్యయగుటచేత, నామె యొక్కొకరి యొద్ద నొక్కొక సంవత్సరము కాలము క్రమముగా నుండున ట్లేర్పాటు చేసికొనిరనియు, వారామెయుండగ తమ సమయము నాలోచించుకొని వేఱుభామల వివాహ మగుచున్నారనియు, ధర్మరాజును భీముఁడును వేఱుభామల వివాహమాడిరనియు, అర్జునునకుఁ బెండ్లి కావలసియున్నదనియు విన్నదయి, సుభద్ర యర్జును నందె మోహము నిలిపెను. "మోహము నిర్మలమును దృఢమును, నిశ్చలమును నగునేని, యార్యావహాదేవి యర్జునునికే భార్యగా నన్నునిచ్చుఁగాక" యని యామె యీశ్వరుని హృదయమునఁ బ్రార్థించెను.

పట్టాభిషేకమహోత్సవమునకు వచ్చిన వారందఱును దమతమ దేశములకుఁ బోయిరి.

## IV

దుర్యోధన దుశ్శాసన కర్ణ శకునులు కడుదుష్టులు. వారికి దుష్టచతుష్టయ మని పేరు. వారనపరాధులగు పాండవుల కెప్పుడును నపకారమునె చింతించుచుందురు. పాండవులను జంపనెంచి లక్కయింటి కగ్ని పెట్టిరి; విషభోజనం బిడిరి; కాని దైవానుగ్రహమువలన వారి కెట్టిముప్పును గలుగలేదు. ధర్మజ పట్టాభిషేక మయినది మొదలుగా దుర్యోధనాదులకు నీర్ష్య హెచ్చెను. పాండవులను హింసించి, వారి రాజ్యముగొని, లోక మపాండవముగఁ జేయవలయు ననియె వారి దుశ్చింత. ఇందులకై వారు మఱెన్నో కపటోపాయముల బన్నుచు వచ్చిరి.

ద్రౌపది పాండవు లేవురిలో దన సమయానుసారముగా నొక్కనితోడ నేకాంతమున నుండునప్పుడు చూచినవా రొకసంవత్సరము తీర్థయాత్ర పోవలె ననియుఁ బాండవు లొడంబడిక చేసికొనియుండిరి. దుర్యోధనాదు లీయొడంబడికను దెలిసిన వారగుట చేతఁ దన్మూలమున బాండవులను వేఱుచేయ నెంచిరి. ఒక్కనాఁడు ద్రౌపదీ సహితుఁడై ధర్మరా జాయుధ శాలలో నేకాంతమున నుండఁగా, దుర్యోధనాదులచేఁ బంపబడినమనుష్యు లొక బ్రాహ్మణుని గోవులను

దొంగిలికొని పోయిరి. ఆబ్రాహ్మణుఁ డార్తనాదము
చేయుచు నాక్రోశించుచు నగరుసమీపమునకు వచ్చెను.
ద్రౌపదీ సమేతుఁడయి ధర్మరాజా యుద్ధశాలయందుండు
టచే నక్కడకుఁ బోఁగూడదని తెలిసియు, బ్రాహ్మణుని
యార్తనాదము విని జాలిగొన్నవాఁడయి, యర్జునుఁడు
ధనుస్సుదేర నాయుధాగారములోనికిఁజని, దానిందెచ్చి
ముచ్చుల వెన్నంటి వారిని వధించి బ్రాహ్మణుని
గోధనమును దెచ్చియిచ్చెను.

ఆ మఱునాఁడు కుంతీగృహమునఁ, గుంతియు,
ధర్మరాజును నర్జునుని వివాహ విషయమై మాటలాడు
చుండిరి. కుంతి, సుభద్రను కొన్నిదినముల క్రిందటనే
చూచినదిగాన, నామె యాకన్నియ గుణరూప సంపద
లను ధర్మజు ముందర వర్ణించి, సుభద్రయే యర్జునునకుఁ
దగిన వధువని చెప్పెను. ధర్మరాజామెకోరికకు సంతసిల్లి
"సుభద్ర నామనసునకు నాఁడేవచ్చెను. కాని బలరామ
కృష్ణుల యిష్టమెట్లున్నదో! కృష్ణుఁడు మనకుఁ బ్రీతి
కూలముగ వర్తింపఁడుగాని, బలరాముఁ డనుకూలించు
టయే దుర్లభము. బలరామునకు దుర్యోధనుని మీఁద
దృష్టియఁట. సుభద్ర పెండ్లివిషయమయి దుర్యోధన
బలరాములకు నుత్తర ప్రత్యుత్తరములును జరుగుచున్న
వఁట" అని పలికెను.

ఇట్లు వారిరువురు మాటలాడుచుండగాఁ దైర్థికు వేషముతో నర్జునుఁడు ప్రవేశించి తల్లికి నన్నకు బ్రణమిల్లె. తల్లి, తైర్థికు వేషమున నున్న కుమారునిఁ గాంచి, యట్టి వేషధారణమునకుఁ గారణమడిగెను. అందుల కర్జునుఁడు, ముందునాఁటిరాత్రి యొకానొక బ్రాహ్మ ణుని గోధనము దొంగలు దొంగిలికొని పోవుచుండఁగా నాతఁడు మొఱ లిడెననియు, నదివిని ధనుస్సు తేర నాయుధశాలకుఁ దానుబోయినపుడు, అందు నేకాంత మున నున్న ద్రౌపదీ ధర్మజులు గనఁబడిరనియుఁ, దమ ప్రమాణము ప్రకారము పండ్రెండు నెలలు తీర్థయాత్ర సలుప నిశ్చయించి తమ యనుజ్ఞ వేఁడవచ్చినట్లును జెప్పెను. గోబ్రాహ్మణ రక్షణార్థమై చేసిన పని నిర్దోషము గావునఁ బ్రాయశ్చిత్తము పెట్టుకోవలసిన పనిలేదని ధర్మరాజెంత చెప్పినను వినక యర్జునుఁ డిట్లనియె; "ధర్మము చేయనెంచి యటకు నేవచ్చినను, నారాకవలన వేఱొకధర్మమునకు హానిగలిగినది కాన, నధర్మమని ధర్మజ్ఞులు దలఁపరు. నేను జేసినది యధర్మము గాదనుకొన్నను, మన ప్రమాణధర్మమునకు హాని గలిగించినది గావున నది ధర్మమనరాదు. లోకులు సత్యాసత్య విమర్శనము చేయరు. నేను నిష్కలుషమగు మనస్సుతో నటకువచ్చినది నిజమే, కాని నామనశ్శుద్ధి

లోక మెట్లెఱుంగును? లోకులు కాకులనిగదా చెప్పుదురు. కాఁబట్టి లోకాపవాదమును బోఁగొట్టుకొనుటకైన నేను సాంవత్సరికవ్రతము సలుపు టావశ్యకము. నాకు సెల వనుగ్రహింపవలయును”

ధర్మరాజును గుంతియు నాతని పట్టుదలం జూచి యెంతో మనఃక్లేశమున విధిలేక ననుజ్ఞయొసంగ వలసిన వారయిరి. అర్జునుఁడు కొందఱు బ్రాహ్మణులను విద్వాంసులను సహాయులఁగాఁగొని తీర్థయాత్ర వెడలెను.

## V

అర్జును డింద్రప్రస్థపురము వీడ్కొని యాయా తీర్థముల సేవసేయుచు మునీశ్వరుల వలన బ్రాహ్మణుల వలనఁ బుణ్యకథలు వినుచు గంగానదిని సేవింపవచ్చెను. అందు నిత్యమును స్నానముచేసి, దాని యొడ్డున హోమముచేయుచుఁ గొన్నిదినము లుండఁగా, నొక్క నాఁటిరాత్రి గాఢనిద్రఁజేయు సమయంబున గొందఱు మ్రుచ్చులేతెంచి యాతని గంగలోఁ బడద్రోసి పాఱి పోయిరి. అప్పు డులూపియను నాగకన్య యాతని చెక్కు చెమర్పకుండ, నిద్రాభంగము సయితము గలుగకుండ, నాగలోకములోని భోగవతీ పురమునందలి తన శయ్యా గృహమునకు నెత్తుకొనిపోయి తన శయ్యాతలముపైఁ

బరుండఁబెట్టికొని, తద్రూపామృతపానమున దనకన్నులను ననిమిషత్వము నొందించుచుండెను. అంత నుదయమున నర్జునుఁడు నిద్రలేచి విస్మితుఁడయి నలుదిక్కులు చూచి వెన్కనున్న లతాంగిని గనుఁగొని "నీ వెవ్వతెవు? ఇదే లోకము? ఏపురము? ఇదెవ్వరి గృహము? నేనిట కెట్లు వచ్చితి" నని యడుగఁగా "నేనులూపియను నాగకన్యకను. ఇది నాగలోకము, భోగవతీపురము. ఈగృహంబు నాయది. నేను గంగా సరిత్తటమున వెన్నెలలో విహరించుచుండగా మిత్రులఁబోలెఁ గొందరు, పరుండియున్న నిన్ను సమీపించి, నీవు గాఢనిద్రలో నుంటఁగాంచి, నిన్ను గంగలోఁ బడఁద్రోసిపోయిరి. నేనదిచూచి జాలి పడి యాపదయందు మునిఁగియున్న నిన్నుఁ దరిచేర్చితి" నని బదులు చెప్పెను. "నీ చేసిన మేలునకు నిన్ను స్మరించువాఁడ. నీకు శుభమగుగాక. నామిత్రులు నాకై వెదకుచుందురు. నన్ను వారింగలుపుము" అని యాతఁడు వేఁడెను. "నిన్ను వారిఁగలప నీ వారలున్నారు. ఓ మోహనాంగా! నీపై మరులుగొని యున్నదానను. నన్ను ధన్యం జేయుము" అని యులూపి సిగ్గునఁబలికెను. అదివిని యర్జునుడు "నేను ద్వాదశ మాసికవ్రతము సలుపుచున్నాఁడను. నిన్నుఁ బరిణయ మిప్పుడు కాఁజాల" నని యెంత చెప్పినను వినక, యులూపి ప్రాణ

త్యాగము చేసికొనఁ బ్రయత్నించెను. అర్జునుఁ డది వారించి స్త్రీహత్యాపాతకము తనకుఁ గలుగునని జంకి తుట్టతుదకామెను బరిణయమాయెను. భోగవతీపురమునఁ గొన్నాళ్లిష్టోపభోగము లనుభవించుచు నుండి, పదపడి నాగలోకము వెలువడి, తన్ను వెదకుచునుండు సహచరులం గలసికొని వారికి జరిగిన వృత్తాంతమంతయు నివేదించెను.

అనంతర మర్జునుఁడు సహచరులతోడ ననేకక్షేత్రముల దర్శించెను. ఒక్కనాఁడు సముద్రతీరమునంగల తీర్థంబు లాడుచుఁబోయి, సౌభద్రమను తీర్థము గాంచెను. అక్కడ నాతని రాకకై వేచియుండిన వేటిరువురు బ్రాహ్మణు లర్జుసునిఁజూచి, "ఓరాజనందనా! సర్వతీర్థముల సేవింపఁ గలిగితిమి. కాని యిందుండు నైదు తీర్థములు మావంటి దుర్బలులకుఁ జొర నశక్యముగా నున్నవి. మాకందు స్నానముచేయించి పుణ్యము గట్టుకొమ్ము" అని వేఁడిరి. అర్జునునోటనుండి బదులుమాట వెడలక మునుపె వెంటవచ్చిన బ్రాహ్మణు లిట్లు పలికిరి. "రాకుమారా! వారికి వాగ్దానము చేయకుము. ఇవి తీర్థమాడఁ దగినవిగావు. వీనియందు మొసళ్ళున్నవి." అనఁగా విని యర్జునుఁడు సర్వతీర్థముల సేవింపవచ్చిన నేనీతీర్థముల స్నానమాడకయుండరాదు.

నేను ముందుగాఁ దీర్థమాడి, యటుపిమ్మట నీబ్రాహ్మణుల
కోరిక తీర్చెద''నని, సౌభద్ర తీర్థము నందఱతో
సమీపించెను. అర్జునుఁడు నీళ్లలోఁగాలిడి డిగియు
దిగకమునుపె, మొసలి యాతనిలాగఁజొచ్చెను. దానితో
నతఁడు పోరాడుచుండ, నాయిరువురు విప్రులు సాయ
పడెదమనిపలికి, యర్జునుని సమీపించి, యాతని నీళ్లలో
బడఁద్రోసి మాయమయిరి. వెంటవచ్చిన బ్రాహ్మణులు
ఆశ్చర్యపడి చూచుచుండ నర్జునుఁడు మొసలినిబట్టియీడ్చి
గట్టునకుఁ బాఱవైచెను. అది చక్కనిజవ్వనియయ్యెను.
అదిచూచి యర్జునుఁ డత్యాశ్చర్యపడి యాభామను దన
యుదంతముఁ జెప్పుమని యడుగఁగా నామె "నేనొక
యప్సరసను. నా చెలికత్తెలు నలుగురు నావలెనె యీ
తీర్థములందు మొసళ్లయి యున్నవారు. మేమెవ్వరము
నొక ఋషి శాపముచేత నిట్లుంటిమి'' అని పలికెను.
అనంతర మర్జునుఁ డాయప్సరస చెప్పిన నలువురకును
శాపవిమోచనము గావించి, మణిపూర పురమునకు
మరలెను.

అందుండి గోకర్ణమునకుఁజని, పడమటిసముద్రతీర
మందలి ప్రభాస తీర్థమును సేవించి, యక్కడకు ద్వార
కావతి సమీపమని వినెను. అంత దూరమువచ్చి ద్వార
కాధీశుఁడగు కృష్ణుని జూడకపోవుట మర్యాదగాదనియు,

అక్కడకుఁ జనినఁ దనమనోహారిణియగు సుభద్రాప్రసన్నదర్శనము లభించుననియు నూహించి, యర్జునుఁడు ద్వారకావతికిఁ బోవ నిశ్చయించెను. ఆ పురమున నితరులు తన్నెఱుంగకుండ నుండవలెననియుఁ, యాదవులు యతులయం దతిభక్తిగలవారనియుఁ దలపోసి, అప్పటికి సాంవత్సరిక వ్రతము ముగిసి యుండఁబట్టి, కృతకసన్న్యాసి వేషమును ధరించి, కృష్ణుని ధ్యానించుచు ద్వారకాపురము చేరువనుండు రైవతకాద్రికిఁ బోయెను.

## VI

సౌభద్రతీర్థమున నర్జును నల్లఁద్రోసి పారిపోయిన వారు దుర్యోధనాదులపంపున వచ్చిన మాయబ్రాహ్మణులు. వారు హస్తినాపురమునకుఁ జని దుర్యోధనాదులఁ జూచి యిట్లనిరి. "దేవరవారికి జయమగుఁగాక. మేము గంగాకూలమునఁ బరున్న యర్జునుని గంగం ద్రోసితిమి. కాని యతఁడొక స్త్రీచే రక్షితుఁడయ్యె. చావఁడాయెఁ గదాయని యాతని వెంబడించి, యుగ్రగ్రాహాశ్రితమగు సౌభద్రంబను తీర్థమునఁ దీర్థమాడునట్లు చేసితిమి. ఆతఁడు తీర్థమాడ నందుదిగఁగా మొసలాతనిఁ బట్టెను. దానితో నతఁడు పెనఁగులాడుచుండఁగా నాతనిని లోనికిఁ బడఁద్రోసితిమి. ఆతఁడు మృతుఁడయినాఁడు,

ఇది నిక్కము." అన విని దుర్యోధనుఁడు, దుశ్శాసనుఁడు శకుని, హృష్టహృదయు లయిరి. దుర్యోధనుఁడు తన కంఠాభరణముఁదీసి యాపోయుల కిచ్చెను. వారు సంతుష్టాంతరంగులయి వెడలిపోయిరి.

అర్జునుఁడు మరణించె నన్నవార్త కర్ణునకు దుఃఖప్రదముగా నుండెను. అశేషబాహుబల యుతుఁడును, విఖ్యాతపరాక్రముఁడును నగు నరునితోఁబోరి లోకైక వీరుఁడను కీర్తిని గాంక్షించినట్టి నేను నాతనివలెనె యొక మూలఁబడి చావవలసి వచ్చెఁగదా యని కర్ణుఁడు చింతించుచుండెను.

సుభద్ర పెద్దయన్నయగు బలరామునకు, సుభద్రను దుర్యోధనున కీవలెననియె కోరిక. దుర్యోధన బలరాములకు సుభద్రా వివాహవిషయమై యుత్తర ప్రత్యుత్తరములు బహుకాలముగా జరుగుచుండెను. ఇప్పుడు సుభద్రా వివాహముహూర్తము నిశ్చయింపఁ బడినదనియు, బంధుమిత్ర పరివారముతో రావలెననియు బలరామునొద్దనుండి దుర్యోధనునకు శుభలేఖ వచ్చెను. అందఱును సంతోషపడి ద్వారకానగర ప్రయాణమునకు సంసిద్ధులగు చుండిరి.

## VII

రైవతకాద్రి యొక రమ్యమగు చిన్నపర్వతము. దాని యగ్రభాగమున సమప్రదేశమునఁ బరిమిత గృహములుగల యొక సుందరమయిన యూరు గలదు. ఆయూరి మధ్యభాగమున నెత్తుమీఁద విశాలప్రదేశమున నొక దేవళము గలదు. ఆ దేవళమున కనతిదూరమునఁ బరిశాంతమై, మునిజనవాస యోగ్యమైన గుహ యొకఁడు గలదు. ఇట్టి గుహ లాపర్వతమున నక్కడక్కడ ననేకములు గలవు. ఆకొండ మూఁడు పార్శ్వము లందును వృక్షచ్ఛాయావిస్తారితములగు సోపానములు గలవు. అందలి సాను ప్రదేశములు పుష్పితలతాసమాశ్రిత నానావిధ ఫలవృక్ష సంకీర్ణములగు వనములుగలిగి మనోహరముగ నుండును. తియ్యనయి జిహ్వకింపగు శుద్ధ జలముగలిగి యద్దములవలె మెఱయు చుండు చిన్నని తటాకము లక్కడ లెక్కకు మీఱియుండును.

కాషాయ వస్త్రములు ధరించిన యర్జునుఁడు రైవతకాద్రి చేరు నప్పటికి జాము ప్రొద్దెక్కి యుండెను. అతఁడువచ్చి కొండమీఁది దేవళము సమీపమందలి గుహలో విడిదిచేసి నిష్ఠమైఁ గూర్చుండి యుండెను. కొండమీఁది గ్రామమువా రాయతీశ్వరుని రాకను దెలిసి, యాతనికి భిక్షయొసంగిరి. పదంపడి సర్వతీర్థాభిగమనంబు

చేసిన యతీంద్రుఁ డొక్కరుఁడు రైవతకాద్రికిఁ జనుదెంచినాఁడని వారు కృష్ణునకు శ్రుతపఱచిరి. అది విని కృష్ణుఁ డాయతీశ్వరుఁడు పాండవ మధ్యముండగు నర్జునుఁడు కాఁదలంచి, యారాత్రియె రైవతకాద్రికి నొంటరిగఁ జని యాతనిం గాంచెను. వార లిరువురు కుశలప్రశ్న పూర్వకమయిన యన్యోన్య ప్రియసంభాషణముల నారేయి గడపిరి. కృష్ణుఁడు వేకువజామున నగరునకుఁ జని మఱునాఁడు రైవతకమహోత్సవ మని యప్పుడ చాటఁ బంచెను.

ఆ మఱునాఁటి ప్రభాత సమయమునఁ గొండ మీఁది దేవళమున మ్రోఁగు వివిధ వాద్యధ్వనులు ద్వారకాపుర జనులను నిద్రనుండి మేలుకొలిపెను. స్త్రీ పురుషులు, బాలికాబాలకులు నందఱు మజ్జనంబులు గావించి, తమతమ యుత్సవవస్త్రములు ధరియించి, ప్రసూనప్రకరములు, ఫల ప్రచయములు, పూజాద్రవ్యములు లోనుగాఁగల యోగ్యవస్తువుల విస్తరిల్లిన పైడి పళ్ళెరములు చేల నిడుకొని, గుంపులు గుంపులుగాఁ గొండ నెక్కసాగిరి. రుక్మిణీసత్యభామాదులు పల్లకులెక్కి తోడరా, బలరాముఁడు, కృష్ణుఁడు, సాత్యకి, సారణుఁడు, అక్రూరుఁడు, ప్రద్యుమ్నుఁడు మొదలగు యాదవశ్రేష్ఠులు హయారూఢులయి పర్వత మెక్కిరి.

జన సందోహములచేఁ బరివృతమగు నప్పర్వతము రమ్యాకృతిఁదాల్చెను. ఆలయములోని యీశ్వరు సందర్శించిన జనసమూహము యతీశ్వరుదర్శనార్థమై గుహయందు మూఁగియుండెను. బలరాముఁ డయ్యతీశ్వరుని విషయమై విని, యందఱాతని సందర్శించుట యుచితమని తలపోసి, కృష్ణననుమతి యడుగఁగా నాతఁడందులకు సంతోషమున సమ్మతించెను. దారితోలఁగింపఁబడెను. యాదవులందఱా యతీశ్వరునకుఁ బుష్పఫలాదులు సమర్పించి ప్రణమిల్లి, తగురీతి బహూకరించిరి. సుభద్ర మొక్కినప్పుడాయతీంద్రుఁడామెపై బఱచిన మోహావలోకనములఁ బట్టి, యర్జునుఁ డామెయందు బద్ధానురాగుఁడయి యుండునట్లు కృష్ణుఁడు గ్రహించెను. పిదప సర్వతీర్థముల మహిమములను, దత్సేవా ఫలములను నాతఁడు చెప్పఁగా విని యందఱు సంతసిల్లిరి. అంతబలరాముఁడు భక్తితత్పరుఁడై "మాభాగ్యవశమున స్వాములవారినిఁ జూడఁగలిగితిమి; ఈవర్షాకాలమున ద్వారవతి యందుండి చాతుర్మాస్యముఁగడపి మమ్ముఁ గృతార్థులం జేయ వలయు" నని ప్రార్థించెను. అర్జునయతి యందుల కంగీకరించెను. యాదవు లాకృతకసన్న్యాసిని నందలమునఁ గూర్చుండఁ బెట్టి యతిగౌరవంబునఁ దోడ్కొని చనిరి.

# VIII

ఇట్లు తోడితెచ్చిన కృతకయతియగు నర్జునుని సుభద్రామందిరోద్యానమందలి లతాభవనమున విడియుంచి, యాతని పరిచర్యకయి సుభద్రను నియమించిరి. సుభద్ర యాతనిఁ జూచినకొలఁది నాతఁ డర్జునుఁడయి యుండునా యని సంశయాకులిత హృదయయై పరిచర్యఁ గడుఁ బ్రీతితోఁ జేయుచుండెను. సుందరి సాన్నిధ్య మతనికిఁ బరమానందప్రదముగా నుండెను.

యతిరాజు తన్నుఁ బ్రసన్నతతోఁ జూచుట యెఱిఁగి, సుభద్ర యొకనాఁడాతని సమీపించి, దూర నిలుచుండి, "స్వాములవారికి ధ్యానభంగము గాదేని కొన్ని సంగతుల నడుగఁదలచి యున్నదానను. మీరు సకల తీర్థసేవనము గావించి యున్నారనియు, అన్నిపురంబుల వీక్షించి యున్నారనియు, సమస్త రాజవరులను నెఱుంగుదు రనియుఁ, గర్ణాకర్ణి వినియున్నదానను. ఇంద్రప్రస్థపురమునకుఁ బోయియుంటిరా? పాండవులందు సుఖముననున్నారా? తీర్థయాత్ర వెడలిన యర్జునుఁడు మరలి వచ్చెనా?" యని సాహసించి యడిగెను. అందున నర్జునుఁడు, "ఇంద్రప్రస్థపురమున నందఱకుఁ గుశలము. సుందరీ! నేనే యర్జునుఁడను. నిన్ను మోహించి, నీకరగ్రహణ మపేక్షించి, యీ రూపమున నీయొద్దకు వచ్చి

నాఁడు. ధ్యానము పేరు చెప్పి నీమనోహర రూపమునే తలపోయుచుందును. ఓమనోహారిణీ! క్షత్రియోచితమగు గాంధర్వమున నన్నుఁ బరిణయమగుము" అనియెను. అది విని సుభద్ర సిగ్గునఁ దలవంచుకొని, "నన్ను సంగఁ దగినవా రిక్కడనే యున్నవారు. వారలె మన మనోగతమునెఱింగి పెండ్లి చేయుదురు. అని పలికి యంతఃపురమునకుఁ జనియెను.

యతి రూపమున నున్న యాతఁడర్జునుఁ డని బలరామాదులకుఁ దక్కఁ దక్కిన వృష్ణియాదవులకును దెలిసెను. వారందఱు సుభద్రకుఁ దగిన వరుఁడింట నున్నాఁడని లోలోన సంతోషపడుచుండిరి.

## IX

దుర్యోధనాదులు పెండ్లినాఁటి యుదయమున జాముప్రొద్దున ద్వారకాపురి కుత్తరముననుండుతోఁటలో సపరివారముగా విడిసిరి. వియ్యంకులకు నెదురుకో లొసంగి వారిని దోడితెచ్చుటకు బలరామాదులు సిద్ధపడి యతీంద్రుని సెలవుగైకొనిపోవఁ బ్రహ్మశాలకు వచ్చిరి. బలరాముఁడాతనితో నాఁడు సుభద్రా వివాహమనియు, వరుఁడు దుర్యోధనుఁడనియు, అతఁడువచ్చి యూరి వెలుపట తోఁటలో దిగియున్నాఁడనియు, ఆతని నెదురు

కొనఁ బోవలయుననియుఁజెప్పి, మునియనుజ్ఞ వేఁడఁగా నాతఁడందుల కియ్యకొనెను. అందఱు వాద్యఘోషతోఁ దరలిరి. కృష్ణు డింటిలోనుండు దేవకీ వసుదేవులకును రుక్మిణి సత్యభామలకును సుభద్రార్జునుల వివాహము జరుగునట్టు లేర్పాటుచేసి, తానేమియు నెఱుఁగనివానివలె బలరాముని వెంటనుండెను.

సుభద్రను బరిణయమగుటకు దుర్యోధనుఁడువచ్చి నాఁడన్న వార్తవిన్న యర్జునుఁడు పరిపరి విధముల యోజింప సాగెను. ఒకసారి దైవసన్నమైన కలికిం జాఱ విడిచితిఁగదా యని యుడుకును. ఒకసారి గాంధర్వ వివాహమున కొడంబడక పోయిన సుభద్రను విచార హీనురాలని నిందించును. ఇంకొకసారి సుభద్రను బలాత్కారమునఁ గొనిపోదునా యని యూహించును. మఱియొకసారి దేవకీ వసుదేవుల పాదములమీఁదఁబడి నానిజమైనస్థితి నెఱింగించి కన్యాదానముచేయ వేఁడుదునా యని తలపోయును.

అక్కడ సుభద్రయు మిక్కిలి ఖిన్నురాలయి యుండెను. దుర్యోధనునకుఁ దానీఁబడునన్న సంగతి తలంపునవచ్చినప్పు డామెకుఁ బ్రాణములె తమస్థానములు విడిచినట్లుండును. "అయ్యో! ఎంత వివేకశూన్యను! ఆ రాజకుమారుఁడే క్షత్రియోచితమగు గాంధర్వమున

నన్నుఁ బరిణయమగుదు నన్నను నందుల కొడంబడక 'నన్నాసంగఁ బెద్దలున్నారు. వారెఱింగి పెండ్లిచేయుఁదు' రనిపలికి యెంత నిర్భాగ్యురాల నైతిని. పురాకృత కర్మ ఫలానుసారముగ బుద్ధిపొడముచుండును. అన్నా! బలరామా! కాకి ముక్కునకుఁ దొండ పండు గట్టినట్టు లానీచుఁడగు దుర్యోధనునకు నన్నేల కట్టఁజూచెదవు? అన్నా! కృష్ణా! నీవర్జునునకుఁ గడుఁ గూర్పుమఱఁదివని కదా ప్రసిద్ధి. అర్జునుని నన్నుఁగూర్చి మమ్ముఁ గృతార్థులఁ జేయుము,'' అని తన మందిరమున సుభద్ర మిక్కిలి వందురుచుండెను.

అంతసత్యభామ యక్కడకువచ్చి యామె చెవిలో నేమో నుడివెను. ఆమె ముఖము వికాస మందెను. ఇరువురు నా చోటువిడిచి పోయిరి. దేవకీ రుక్మిణీ సత్యభామలు సుభద్రకు మంగళస్నానముచేయించి మణిభూషణంబులు రుచిరాంబరములుఁ దొడిగిరి. అనంతరము దేవకీవసుదేవులును రుక్మిణీ సత్యభామలును వస్త్రాభరణంబులు, ఫలపుష్పంబులు, మంగళ ద్రవ్యములుఁగల బంగరు పళ్ళెరంబులు గొని సుభద్రతోడ నర్జునులతామందిరమునకుఁజని యాతనిముందర వాని నుంచిరి. అర్జునుఁడు శుభము కానున్నదని తలపోయుచుండెను. అంతట వసుదేవుఁడు సుభద్రను ముందిడుకొని ముందరికి

నడచివచ్చి "అర్జునా! మీ యుభయుల మనస్సెఱింగిన వారము. ఈవస్త్రాభరణంబులు ధరించి నీనిజమైనరూపమున నీ కన్యం బరిగ్రహింపుము" అని నుడువ నాతఁడు సంతోషపులకిత గాత్రుఁడయ్యు నూరకుండెను. మరల వసుదేవుఁడు "విజయా! ఆలస్యము చేయనేల?" అని పలికెను. ఇంకఁ దడవుచేసినఁ గార్యము కాదనితలఁచి యర్జునుఁడు వస్త్రాదికములు దొడిగికొనెను. సుభద్ర యాతని కంఠమునఁ బుష్పమాలను గీలించి యవనత శిరస్కయయ్యెను. అర్జునుఁడు సుభద్ర పాణిగ్రహించెను. దేవకీ రుక్మిణీ సత్యభామలు మణిదీపములు నివాళించిరి. పిదప వసుదేవుఁ డర్జునునితో "అల్లుడా! ఆయుధములతో నిండిన రథము వాకిట సిద్ధముగా నున్నది. సుభద్రా ద్వితీయుఁడవై, బాహుబలంబు తోడుగ, భద్రముగ నింద్రప్రస్థమునకుఁ బ్రయాణమగుము. పునర్దర్శనము శీఘ్రకాలమున నగును" అని పలికెను. అర్జునుఁడు దేవకీ వసుదేవులకుఁ బ్రణమిల్లెను. సుభద్ర దేవకీ వసుదేవులకును రుక్మిణీ సత్యభామలకును మ్రొక్కెను. సుభద్రార్జునులు వారి దీవనలం గైకొని గుమ్మము నొద్దనున్న రథము సమీపించి దాని నెక్కిరి. సుభద్ర సారథిస్థానంబున కూర్చుండి రథము నడిపెను.

# X

రథ మింద్రప్రస్థాభిముఖమై తూర్పుగవను పోవుచుండ నక్కడి కావలివారు దాని నడ్డగించిరి. కాని, యర్జునుఁడు బాణములనేసి వారిని నొప్పింపఁగా, వారు మొఱలిడుచుఁ బాఱివచ్చి దుర్యోధనాదులను నెదుర్కొన బోయిన కృష్ణ బలరామాదులం గాంచి, యెవ్వఁడో యొక్కఁడు సుభద్రను దొంగిలికొనిపోయెనని చెప్పిరి. బలరాముఁడు మనసు కలంగ నివ్వెరపడెను. దుర్యోధనాదులు “ఇంత సాహస మర్జునునకుఁదప్ప మఱేరికి నుండదు. వాఁడర్జునుఁడే యయియుండును. అర్జునుఁడు చచ్చెననువార్త కల్లవార్త”యనితలపోసి, బలరామకృష్ణుల జూచి, “మేమిదె పోయి యామ్రుచ్చుం బరలోకమునకుఁ బుచ్చి కన్యం దెచ్చెదము. మీరూరిలోనికి జనుఁడు,” అని పలికి సాయుధులయి రథంబు లెక్కిపోయిరి. కాని, కృష్ణుఁ డాఁడుదానితోఁ బోర నొల్లక తనదారిఁ బోయెను. బలరామాదులు, సుభద్రను దుర్యోధనుఁడు దెచ్చునన్న నమ్మకముతో, నూరిలోనికి మరలిరి. సుభద్రార్జునుల వెంబడించి పోయిన దుర్యోధనాదులు వారిని గలసికొనిరి. వారికిని వీరికిని హోరాహోరి పోరు జరిగెను. సుభద్ర బాణప్రయోగకౌశలము చూపెను. దుర్యోధనాదులు కాందిశీకు లయిరి. అర్జునుఁడు సుభద్రయొక్క యుద్ధ

నైపుణ్యమునకు నామెను మెచ్చుకొనెను.

అట బలరాముఁడు తనయింట యతిరూపమున నుండినది యర్జునుఁడనివిని, కొంగున నగ్గిని గట్టుకొన్నట్లు లాయెఁగదా యనివగచి, వానిని మట్టుపెట్టఁ గృష్ణునితో నాలోచించెను గాని, యాతఁ డౌదాసీన్యమును వహించి యుండెను. కృష్ణుఁడే సుభద్రార్జునుల వివాహమునకుఁ దోడుపడినాఁడని నిలుకడమీఁద నెఱింగియు, బలరాముఁ డా ముచ్చిమి విషయమయి తన యభిప్రాయము నిమ్మని కృష్ణుని నిక్కచ్చి చేయఁగా నాతఁడిట్లు పలికెను. "అర్జునుడు మనకు మేనమఱఁది. అతఁడు దుర్యోధనుని వలె నధర్మపరుఁడుగాక ధర్మశీలుఁడు. కులశీలంబులె కాక రూపయౌవనాది శుభలక్షణములుం గలవాఁడు. క్షత్రియా వంశ సంజాతయుఁ స్వయంవర స్వాతంత్రయునగు మన సుభద్ర సర్వలక్షణ సంయుతుడగు వరుని వలచినది. ఇదియొక తప్పా!" అనఁగా విని బలరాముఁడు "సుభద్ర మనోగతము నే నెఱుంగను. ఎఱిఁగి యుండిన దాని మనోభీష్టమునకుఁ బ్రతికూలముగా వర్తించి దాని సుఖ సంతోషములకు భంగము గలిగింప యత్నింతునా? మనమందఱ మింద్రప్రస్థపురమున కిప్పుడ తరలిసుభద్రా ర్జునుల వివాహమక్కడనె నెఱపుట యుచితము," అని బదులాడెను, కృష్ణుఁ డింద్రప్రస్థపుర ప్రయాణమునకు

సమ్మతించెను. యాదవు లందఱు తత్ ప్రయాణమునకు సన్నద్ధులయిరి.

అర్జునుఁడట్లు సుభద్రా ద్వితీయుఁడయి యింద్రప్రస్థపురము చేరెను. సుభద్ర కుంతీదేవికి మ్రొక్కి పిదప ద్రౌపదికి మ్రొక్కెను. వారు ప్రతిపక్ష వీరవిజయుఁడు నీకు మగఁడవుఁగావుతయని దీవించిరి. అర్జునుఁడు పెద్దలందఱకును బ్రణమిల్లి తాను సుభద్రను దెచ్చిన విధము నెల్లరకుఁ దెలుపుచుండఁగా దేవకీ వసుదేవులును బలరామ కృష్ణ గద సాత్యకి ప్రద్యుమ్న ప్రముఖులును, రుక్మిణీ సత్యభామాదులును వచ్చి యూరివెలుపల నున్నారని విని ధర్మరాజు, నకుల సహదేవులను వారికెదురుకోలునకుఁ బుత్తెంచెను. వారు వెడలి యాదవులను దోడితెచ్చిరి. ధర్మరాజు ప్రత్యుద్గమించి దేవకీ వసుదేవులకు నమస్కరించి, బలరామకృష్ణాదులను బ్రీతిపూర్వకముగ సత్కరించి తగిన విడుదల విడియించెను. బలరాముఁడు క్షమాపణ పూర్వకముగాఁ దాము వచ్చిన కార్యమును దెలియఁ జేసెను. ధర్మరాజందులకుఁ గడు సంతోషమున సమ్మతించి మఱునాఁడె సుభద్రార్జునుల వివాహమని చాటించెను.

వివాహమహోత్సవము సప్తదినంబులు మిక్కిలి వేడుకగా జరిగెను. కృష్ణుఁడు వధూవరులకు నానావిధ

వస్తువాహనంబు లరణంబు లిచ్చుటయేగాక, కుంతీ దేవికిని ధర్మజ భీమ నకుల సహదేవులకును ద్రౌపదికిని సముచితములగు నుడుగరలిచ్చి పూజించెను. ధర్మరాజు యాదవులకెల్లను భూషణాంబరములొసంగిసత్కరించెను. యాదవులిట్లు ప్రతిపూజ లందినవారయి ద్వారకకు మరలిరి. కృష్ణుఁడుమాత్రమింద్రప్రస్థముననె నిలిచి సుభద్రార్జునులతో నిష్టవినోదంబులఁ బ్రొద్దుబుచ్చుచు నుండెను.